94931 70689 www.rajadhanivartalu.com rajadhanivartalu rajadhaniv RNI No. APTEL 2015/ 66622 స్థాపితం : 2015 Postal Regd No: GTR/84/2016-18




# రాజధాని వార్తలు

Voice of Voiceless




అమరావతి సంపుటి : 3 సంచిక 39, పేజీలు 4 వెల: రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు వార పత్రిక సోమవారం 18 - ఆదివారం 24 జూన్, 2018

వివరాలు2లో...



చేపల వేట సందిగ్ధమే...!

వివరాలు3లో...



హిజాబ్ నిబంధనపై భారత క్రీడాకారిణుల విముఖత

వివరాలు4లో...




'నాటా' ఆధ్వర్యంలో షార్ట్ ఫిల్మ్ పోటీలు

వివరాలు4లో...



ఆనందం నింపే రంజాన్

# ప్రభుత్వ బడికి పోదాం..

- ఈ ఏడాది నుంచి ప్రభుత్వ ఇంగ్లీషు మీడియం పాఠశాలలు
- దిగువ మధ్య తరగతి తల్లిదండ్రుల్లో విరిసిన ఆనందం





**రాజధాని ప్రతినిధి, విజయవాడ / గుంటూరు :** వేసవి సెలవుల తర్వాత పాఠశాలలు ప్రారంభమయ్యాయి. ఈ విద్యాసంవత్సరంలో మున్సిపల్ పాఠశాలల్లో ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇంగ్లీషు మీడియం స్కూళ్లకు మంచి స్పందన వచ్చింది. పాఠశాలలు ప్రారంభించేనాటికి విద్యార్థుల కోసం అన్ని ఏర్పాట్లు చేశామని అధికారులు చెబుతున్నారు. అయితే విజయవాడ, గుంటూరు ప్రభుత్వ ఎయిడెడ్, రెసిడెన్షియల్, మున్సిపల్, పంచాయతీ రాజ్ పాఠశాలల్లో ఇంతవరకు పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు అందలేదు.

విజయవాడలోని 28 మున్సిపల్ హైస్కూళ్లు, ఒక అప్పర్ ప్రైమరీ, 26 ప్రాథమిక పాఠశాలల్లో ప్రయోగాత్మకంగా ఇంగ్లీషు మాధ్యమాన్ని ప్రవేశపెట్టారు. ఈ పాఠశాలల్లో తమ పిల్లలను చేర్చడానికి తల్లిదండ్రులు ఉత్సాహంగా ముందుకొస్తున్నారని డిప్యూటీ ఎడ్యుకేషనల్ అధికారి దుర్గాప్రసాద్ చెబుతున్నారు.. విజయవాడ మున్సిపల్ కమిషనర్ జే. నివాస్ మార్గదర్శకాలతో మున్సిపల్ పాఠశాలల్లో విద్యార్థులను ఆకర్షించే అనేక కార్యక్రమాలను రూపొందించారన్నారు. విద్యలో వెనుకబాటుకు గురయ్యే విద్యార్థుల కోసం ఫౌండేషన్ కోర్సు, ఉత్తమ విద్యార్థులకోసం అడ్వాన్స్‌డ్ ఫౌండేషన్ కోర్సులను ప్రవేశపెట్టారన్నారు. దీంతో మున్సిపల్ పాఠశాలల్లో సంతృప్తికరంగా విద్యార్థులు ప్రవేశిస్తున్నారని, కొన్ని పాఠశాలల్లో నోవేకన్సీ బోర్డులు కూడా ఉంచారని ప్రసాద్ వివరించారు. విద్యాసంవత్సరం ప్రారంభం కాగానే ప్రభుత్వం పాఠ్యపుస్తకాలను అందుబాటులోకి తీసుకురాలేక పోవడం కాస్త ఇబ్బంది కలిగించినా, అవికూడా సక్రమంగా పంపిణీ జరిగి ఉంటే ఉపాధ్యాయులు, అధికారులు మరింత ఉత్సాహంగా తల్లిదండ్రులను పాఠశాలల్లో చేర్పించమనేందుకు మరింత అనువుగా ఉండేదన్నారు.

గుంటూరులో 3,013 ప్రాథమిక, 813 అప్పర్ ప్రైమరీ, 1046 హైస్కూళ్లలో దాదాపు 6.49 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. ఏది ఏమైనా ప్రభుత్వ ప్రయోగాత్మకంగా ప్రారంభించిన ఇంగ్లీషు మీడియం పాఠశాలలు మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి తల్లిదండ్రులను ఆకర్షిస్తున్నా యనడంలో ఎటువంటి సందేహం లేదు.

ఒకమాదిరి ప్రైవేటు స్కూళ్లు కూడా ప్రైమరీ విద్యార్థుల నుంచి రూ. 10, వేల నుంచి రూ.20 వేల వరకు ఫీజులు వసూలు చేస్తున్నాయి. అదే హైస్కూలు విద్యకు వచ్చేసరికి 20 వేల నుంచి రూ. 45 వేల వరకు ఫీజులు ఉంటున్నాయి. ఇంతే కాకుండా ట్యూషన్ ఫీజు, స్పెషల్ ఫీజు, పుస్తకాలు, యూనిఫారం పేరుతో వారు మధ్యతరగతి తల్లిదండ్రులను దోచుకుంటున్నారు. అదేసమయంలో వాటిలో పిల్లను ఉత్తేజితులు చేసే ఆటస్థలం, లాబొరేటరీ, ఉండవు సరికదా ప్రావీణ్యం పొందిన టీచర్లు కూడా ఉండరు.

ప్రైవేటు స్కూళ్లలో ఉపాధ్యాయుడు విద్యార్థుల శాతం 1:30 గా ఉంటే ప్రభుత్వ పాఠశాలల్లో 1:20 గా ఉంది. ప్రైవేటు స్కూళ్ల ధనదాహానికి మధ్యతరగతి వర్గాలు బలవుతున్నాయి. ప్రస్తుతం ప్రభుత్వం ఇంగ్లీషు మీడియం పాఠశాలలు ప్రవేశపెట్టడం ఆయా వర్గాలకు ఊరట నిస్తోంది.

విజయవాడలో ఒక లక్ష మంది విద్యార్థులు 270 ప్రైవేటు పాఠశాలల్లో

- మిగతా 2 లో

రాష్ట్ర ప్రభుత్వం జూన్ 12 నుంచి పాఠశాలలను తిరిగి ప్రారంభించినా ప్రైవేటు పాఠశాలలు మాత్రం జూన్ 14 నుంచే పనిచేయనున్నాయి. జూన్ 12 మంగళవారం, 13న అమావాస్య కావడంతో ఈనెల 14 నుంచి ప్రైవేటు పాఠశాలలు ప్రారంభం కానున్నాయి. ప్రభుత్వం 12 నుంచి పాఠశాలలను పున:ప్రారంభించినా హాజరు శాతం అంతంత మాత్రంగానే ఉంది.

## నిర్లక్ష్యంపై చంద్రబాబు ఆగ్రహం



**రాజధాని ప్రతినిధి,అమరావతి :** గుంటూరు జిల్లాలో రహదారుల దుస్థితిపై సీఎం చంద్రబాబు స్వయంగా స్పందించారు. రియల్ టైం గవర్నెన్స్ కేంద్రం నుంచి రహదారులను పరిశీలించిన సీఎం అధికారుల పనితీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పనుల్లో నిర్లక్ష్యం ప్రదర్శించిన పంచాయతీ రాజ్ సైట్ ఇంజినీర్‌ను సస్పెండ్ చేశారు. వర్చువల్ ఇన్‌స్పెక్టర్ ద్వారా చివులూరు – కొల్లిపర రహదారిని పరిశీలించిన ముఖ్యమంత్రి పనులు జరిగిన ప్రదేశంలో అధికారులెవరూ లేకపోవడంతో అసహనం వ్యక్తంచేస్తూ తక్షణమే చర్యలకు ఉపక్రమించారు. విజయవాడలో స్వరాజ్ మైదానంలో చెత్త వేయడంపైనా ముఖ్యమంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. విజయవాడ నగరపాలక సంస్థ అధికారుల వైఖరిపై మండిపడ్డారు. తక్షణమే పరిస్థితిని చక్కదిద్దాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. విజయవాడ నగరపాలక సంస్థ అడిషనల్ మెడికల్ అండ్ హెల్త్ అధికారిని సస్పెండ్ చేయాలని వీఎంసీ కమిషనర్‌ను ఆదేశించారు. రియల్ టైం గవర్నెన్స్ కేంద్రం నుంచి తొలిసారిగా రాష్ట్రంలో వివిధ రహదారుల వర్చువల్ ఇన్‌స్పెక్షన్ ద్వారా పర్యవేక్షించారు. ఇంత నిర్లక్ష్యం పనికి రాదంటూ అధికారులపై మండిపడ్డారు.

## పెనుమాకలో పట్టపగలే భారీ చోరీ



**రాజధాని ప్రతినిధి, తాడేపల్లి :** గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం పెనుమాకలో గురువారం పట్టపగలే భారీ చోరీ జరిగింది. వినాయక గుడి కూడలిలోని మేకా వేమారెడ్డి ఇంట్లోకి ముగ్గురు దుండగులు ప్రవేశించి ఆయన భార్య కమలను నిర్బంధించి రూ.కోటిపైగా నగదు, ఆమె కోడలు శివపార్వతి వద్ద ఉన్న 20 సవర్ల బంగారాన్ని అపహరించారు. చోరీ సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. జిల్లా అర్బన్ ఎస్పీ విజయారావు హుటాహుటిన పెనుమాక చేరుకొని బాధితులతో మాట్లాడారు. ఉదయం 11.30 గంటల సమయంలో ముగ్గురు వ్యక్తులు వచ్చి పాఠశాల అడ్రస్ కావాలని అడిగారని కమలమ్మ పోలీసులుకు తెలిపారు. ఇక్కడ ఎవరూ లేరని వెంటనే బయటకు వెళ్లిపోవాలని గట్టిగా చెప్పడంతో తనపై దాడి చేశారని.. తాను చనిపోయాననుకొని బీరువాలోని రూ.కోటిపైగా ఉన్న నగదు, తన కోడలి వద్ద ఉన్న 20 సవర్ల బంగారాన్ని తీసుకెళ్లారని ఎస్పీకి వివరించారు. రెండు రోజుల క్రితం తమకు ఉన్న పొలాన్ని రూ.2.8 కోట్లకు విక్రయించగా వచ్చిన సొమ్ములో రూ.40 లక్షలను వేరే ప్రాంతంలో పొలం కొనుగోలుకు బయానా ఇచ్చామని వివరించారు. మిగిలిన సొమ్మును రెండు బ్యాగుల్లో పెట్టగా ఒక బ్యాగ్‌ను అపహరించుకు పోయారని ఆమె వాపోయారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాజధాని ప్రాంతం.. అందులోనూ కూతవేటు దూరంలో ముఖ్యమంత్రి నివాసం ఉన్నచోట ఈ ఘటన జరగడంతో పోలీసులు దీన్ని మరింత తీవ్రంగా పరిగణిస్తున్నారు. సమీపంలోని నిఘా నేత్రాలలో ద ృశ్యాలను పరిశీలించి ఇప్పటికే కొంత సమాచారాన్ని సేకరించారు. క్లూస్ టీంను రంగంలోకి దించారు. త్వరలో నిందితులను అరెస్టు చేస్తామన్నారు.

# డీజీపీ రేసులో సీనియర్లు

**ఏఆర్ అనురాధ, గౌతం సవాంగ్, ఎన్ సురేంద్ర బాబు, ఆర్పీ ఠాగూర్**









**రాజధాని ప్రతినిధి, విజయవాడ :** ప్రస్తుత డీజీపీ ఎం మాలకొండయ్య ఈ నెలాఖరుకు పదవీవిరమణ పొందుతుండగా, ఎవరు డీజీపీగా నియమితులవుతారనే విషయంపై పోలీసు శాఖలో తర్జనభర్జనలు జరుగుతున్నాయి. రాష్ట్ర డీజీపీని నియమించుకునే హక్కు కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏపీ పోలీస్ చట్టంలో (సంస్కరణలు) సవరణలు చేసింది. అంతకుముందు డీజీపీ నియామక జాబితాను కేంద్ర యూపీఎస్‌సీకి పంపాల్సి వచ్చేది.

విజయవాడ పోలీస్ కమిషనర్ సీనియర్ ఐపీఎస్ అధికారులు గౌతం సవాంగ్, యాంటీ కరప్షన్ బ్యూరో డీజీ ఆర్పీ ఠాగూర్, ఏపీఎస్ఆర్టీసీ ఉపాధ్యక్షుడు, మేనేజింగ్ డైరెక్టర్ ఎన్ సురేంద్రబాబు, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీ ఏఆర్ అనురాధ ఈ రేసులో ఉన్నారు. గౌతం సవాంగ్, ఆర్పీ ఠాగూర్‌లు ఈ పదవికోసం లాబీలు నడుపుతున్నారు. 1986 ఐపీఎస్ బ్యాచ్ కు చెందిన ఠాగూర్ (57) 2016 నవంబరులో ఏసీబీ చీఫ్‌గా నియమితులై సమర్థవంతంగా విధులు నిర్వహిస్తూ అన్ని శాఖల్లోనూ డజన్ల కొద్ది అక్రమాస్తుల అధికారుల కేసులను వెలికి తీశారు. వారిలో మున్సిపల్ , దేవాదాయ, పంచాయతీరాజ్, రెవెన్యూ, రవాణా, పోలీసు శాఖల అధికారులు ఉన్నారు. 1961లో జన్మించిన ఆయన 2021లో రిటైర్ అవ్వనున్నారు.

విజయవాడ కమిషనర్ డీ గౌతం సవాంగ్ శాంతిభద్రతలను కాపాడటంలో ముందున్నారు. 2015 ఆగస్టులో ఆయన ఈ పదవి చేపట్టారు. రౌడీలను, అక్రమ వడ్డీ వ్యాపారులు, కాల్‌మనీ బ్రోకర్లు, కిడ్నాపింగ్ బ్యాచ్‌లను నిరోధించడంలో ఆయన విజయవంతం అయ్యారు. శాంతి భద్రతలను కాపాడటంలో ఆయనకు అనేక సవాళ్లు ఎదురయ్యాయి. ధర్నాచౌక్ వద్ద అధిక సంఖ్యలో పోలీసులను నియమించి ఆందోళనాకారులను ఉక్కుపాదంతో అణచి వేస్తున్నారని రెండేళ్లుగా ఆయనపై ఆరోపణలు ఉన్నాయి. మహిళా ఆందోళనాకారులపై పోలీసులు బలప్రయోగం చేస్తున్నారని ఆయనపై పలు విమర్శలు రాగా, మహిళలు, పిల్లలు,వృద్ధుల కోసం మహిళా మిత్ర, వృద్ధమిత్ర వంటి ప్రత్యేక సెల్‌లను ఏర్పాటు చేశారు.

ఈ రేసులో ఎన్ సురేంద్రబాబు కూడా ఉన్నారు. వాస్తవానికి ఆర్టీసీ చైర్మన్‌నే డీజీపీగా నియమించే సంప్రదాయం కొనసాగుతోంది. అత్యంత ధైర్యవంతుడిగా, ముక్కుసూటి మనిషిగా ఆయనకు పేరుంది. ఆయనకు విజయవాడ,హైదరాబాద్‌ల్లో పనిచేసిన అనుభవం కూడా ఉంది. పైస్థాయి అధికారులతో, కిందిస్థాయి సిబ్బందితో మంచి సంబంధాలు ఉన్నాయి.

## నాగవైష్ణవి హత్య కేసులో దోషులకు జీవితశిక్ష



**రాజధాని ప్రతినిధి, విజయవాడ :** రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన చిన్నారి నాగవైష్ణవి హత్య కేసులో తీర్పు వెల్లడైంది. ఈ కేసులో దోషులకు యావజ్జీవ కారాగార శిక్ష (బ్రతికి ఉన్నంతవరకు జైలు) విధిస్తూ విజయవాడ కోర్టు తీర్పు ఇచ్చింది. కేసులో ఏ–1 మోర్ల శ్రీనివాసరావు, ఏ–2 జగదీష్, ఏ–3 పలగాని ప్రభాకర్‌రావు బావమరిది పంది వెంకటరావు గౌడ్.. ఈ ముగ్గురికీ కోర్టు జీవిత ఖైదు విధించింది. అతినీచమైన, హేయమైన చర్యగా న్యాయమూర్తి అభివర్ణించారు. హత్య, కిడ్నాప్ కింద నేరాలు రుజువైనట్టు వెల్లడించి కోర్టు దోషులకు జీవిత ఖైదు విధించింది. ఉమ్మడి రాష్ట్రం విజయవాడలో 2010 జనవరిలో జరిగిన పలగాని నాగవైష్టవి హత్య కేసు

- మిగతా 2 లో





ఆంధ్రప్రదేశ్ ప్రజల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా అమరావతి వెల్ఫేర్ కౌన్సిల్

సంప్రదించండి

FB:amaravathiwelfarecouncil

76809 94755, 88861 11881,


## స్టీల్‌ప్లాంట్ల నిర్మాణం పరిశీలనలో ఉంది : కేంద్రం



**న్యూఢిల్లీ :** ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లోని కడప, బయ్యారంలలో స్టీల్ ప్లాంట్ల నిర్మాణం సాధ్యం కాదంటూ సుప్రీంకోర్టులో కేంద్రం అఫడవిట్ దాఖలు చేయడంపై ఉభయ తెలుగురాష్ట్రాల్లో వ్యతిరేకత వ్యక్తం అయింది. దీంతో నష్టనివారణ చర్యల్లో భాగంగా కడప, బయ్యారంలలో స్టీల్ ప్లాంట్ల నిర్మాణాలను పరిశీలిస్తున్నామని కేంద్ర ఉక్కు మంత్రిత్వ శాఖ పేర్కొంది. స్టీల్ ప్లాంట్ల నిర్మాణంపై 2016లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రతినిధులు, పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ ప్రతినిధులను టాస్క్ ఫోర్స్‌గా నియమించారు.

ఆ తర్వాత టాస్క్ ఫోర్స్ ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలతో పలుమార్లు సమావేశం అయింది.స్టీల్ ప్లాంట్ల ఏర్పాటుపై మెకాన్‌తో కలిసి ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలను ఫిజిబిలిటీ రిపోర్ట్ తయారు చేయాలని కోరినట్లు ఉక్కు మంత్రిత్వ శాఖ వివరించింది. ప్రాజెక్టుల ఏర్పాటుకు ఆర్థిక సమస్యలను చక్కదిద్దేందుకు యత్నిస్తున్నట్లు తెలిపింది.


RAMADAN MUBARAK







RAMADAN MUBARAK



రాజధాని వార్తలు
కలం

## శాంతి సౌభాగ్యాలకు రంజాన్

ప్రతి మనిషిలోనూ సానుకూల, వ్యతిరేక భావనలు ఉంటాయి. అయితే ఎప్పటికప్పుడు వ్యతిరేక ఆలోచనలను సమాధి చేసి మంచి ఆలోచనలు పెంచుకోవడమే మనిషి కర్తవ్యం. దీనికోసమే అల్లాహ్ దివ్య ఖురాన్ గ్రంధాన్ని తన ప్రజలకు ఇచ్చారు. దానిని పఠించడం ద్వారా చెడ్డతలంపుల నుంచి విడుదల పొందవచ్చు. అందుకు నమాజ్ చాలా అవసరం. నమాజ్ దుష్టచింతనలను, దురాగతాల్ని, కుహనా సంస్కారాన్ని ఎదుర్కోగలదు. సత్ప్రవర్తనను నేర్పించగలదు. సత్ప్రవర్తనగల వ్యక్తి సర్వేశ్వరుని దృష్టిలో అందరికన్నా మిన్న (ఖురాన్ 49:13) ఈద్‌ను శ్రామికుని వేతనం లభించే రోజు అని ఖురాన్ విస్పష్టం చేసింది.

దేవుడు మనుష్యులను పేద,గొప్పవారిగా పుట్టించినా ఎదుటివారి పట్ల ఎవరు ఎలా ప్రవర్తిస్తున్నారనేది ఎప్పుడూ గమనిస్తూ ఉండటారు. ఎంతటి ధనవంతుడైనా తినేది కడుపుకు చాలినంత అన్నం మాత్రమే.. ఎంత బంగారం తన దగ్గర ఉన్నప్పటికీ తినలేడు. అందువల్ల క్షుద్బాధ అందరికీ ఒకటే అని గుర్తించి సాటి వారిని ఆదుకోవాలనే తలంపుతోనే నెల రోజుల ఉపవాస దినాలను దేవుడు ఆదేశించాడు.

ఈ నెల రోజులు కఠోరవ్రతం పాటించినవారి శ్రమకు పరిపూర్ణ ప్రతిఫలం రంజాన్ రోజే లభిస్తుందని విశ్వాసం. పర్వదినాన ఉదయం స్నానపానాదులు ముగించుకుని వస్త్రాలు ధరించి సుగంధం పన్నీరు పూసుకుని తక్బీర్ పఠిస్తూ ఈద్‌గాహ్ చేరుకుంటారు. సమస్త మానవాళి హృదయాల్ని సద్బుద్ధితో నింపాలని కోరుతూ అక్కడ ప్రార్థన చేస్తారు.

ఇహ్‌దినస్సిరాత్ ముస్తఖీమ్ (మాకు సన్మార్గాన్ని చూపు) అనే వారు దేవుడిని వేడుకుంటారు. ఈద్‌గాహ్‌లో నమాజ్ పూర్తి అయిన తర్వాత అక్కడ సమావేశమైన వారిలో వీలైనంత ఎక్కువ మందిని కలిసి స్నేహభావంతో హృదయానికి హత్తుకుంటూ ఈద్ ముబారక్ (పండుగ శుభాకాంక్షలు) తెలియజేసుకుంటారు.

అనంతరం ముస్లిమేతర సోదరుల్ని ఇంటికి ఆహ్వానిస్తారు. అమితానందంతో పరస్పరం ఆలింగనం చేసుకుంటారు. విందు ఆరగిస్తారు. ఈద్‌విలాప్ సమావేశాలు ఏర్పాటు చేస్తారు. ఇవన్నీ మతసామరస్యానికి, పరస్పర సదవగాహనకు, సమైక్యతకు ప్రతీకలు. సకల సమృద్ధిని దయచేసే కరుణామయుడైనా ఆ దేవదేవుడు యుగయుగాలు మానవాళిని దీవించును గాక..ఆమీన్




## నిందితులకు జీవితశిక్ష

(మొదటిపేజీ తరువాయి)

తుది తీర్పు ఎనిమిదేళ్ల తర్వాత వెల్లడైంది. బీసీ సంఘం నేత, మద్యం వ్యాపారి పలగాని ప్రభాకర్ తన అక్క కూతురు వెంకటరామమ్మను చేసుకున్నాడు. వారికి దుర్గాప్రసాద్ అనే కుమారుడు ఉన్నాడు. కొన్నాళ్లకు ప్రభాకర్ నిజామాబాద్ జిల్లాకు చెందిన నర్మదను రెండో పెళ్లి చేసుకున్నాడు. ఈ దంపతులకు సాయితేజష్, నాగవైష్టవి సంతానం. పాప వైష్టవి పుట్టిన తరువాతే తన దశ తిరిగిందన్నది ప్రభాకర్ నమ్మకం. గారాలపట్టి వైష్టవి పేరుతో ఆస్తులన్నీ పెడుతున్నాడన్న భావన మొదటి భార్య సోదరుడు పంది వెంకటరావులో బలంగా ఏర్పడింది. దీంతో వైష్ణవిని చంపాలని నిర్ణయించుకున్న వెంకటరావు, తన చిన్నమ్మ కొడుకు శ్రీనివాసరావుతో కోటి రూపాయలకు ఒప్పందం చేసుకున్నాడు. జనవరి 30న చిన్నారి వైష్ణవిని కిడ్నాప్ చేసి చంపేశారు. తర్వాత ఆమె శవాన్ని బాయిలర్‌లో వేసి బూడిద చేశారు.

### అన్న ఆవేదన

కోర్టు తీర్పుపై నాగవైష్ణవి సోదరుడు హరీష్ స్పందించారు. నాగవైష్ణవి కేసులో జడ్జిమెంట్ కరెక్ట్‌గా వచ్చిందని భావిస్తున్నానని అన్నారు. తాను ఎప్పుడు లైఫ్ అండ్ టిల్ డెత్ అనే తీర్పు వినలేదని చెప్పాడు. తీర్పు లేటుగా వచ్చిందని, రెండేళ్ళ క్రితం తీర్పు వచ్చి ఉంటే ఈ కేసు కోసం పోరాడిన తన తల్లి, బాబాయ్‌తో పాటు ఎంతో మంది సంతోషించేవారని పేర్కొన్నారు. ఇక మీదట మరొకరు ఇలాంటి దారుణాలకు పాల్పడకుండా తీర్పు వచ్చిందన్నారు. నిందితులకు కఠిన శిక్ష పడాలని మా అమ్మ కోరుకునేదని హరీష్ కన్నీరు మున్నీరయ్యారు.

## రవాణా నౌకలో అగ్ని ప్రమాదం...

**సిబ్బంది సురక్షితం...**



**న్యూఢిల్లీ :** ఆంధ్ర ప్రదేశ్‌లోని కృష్ణ పట్నం నుంచి కోల్‌కతా వెళ్తున్న సరుకు రవాణా నౌక గురువారం అగ్ని ప్రమాదానికి గురైంది. దీనిలో 22 మంది సిబ్బంది ఉన్నారు. వీరందరూ క్షేమంగా ఉన్నారు. కోల్‌కతా పోర్ట్ ట్రస్ట్ అధికార ప్రతినిధి సంజయ్ తెలిపిన వివరాల ప్రకారం బుధవారం అర్ధరాత్రి ఎం వీ ఎస్ఎస్ఎల్ కోల్‌కతా నౌకలో మంటలు చెలరేగాయి. బంగాళాఖాతం, హుగ్లీ నది సంగమ ప్రాంతంలో ఈ ప్రమాదం జరిగింది. హల్దియా నౌకాశ్రయం నుంచి తీర గస్తీ దళం సిబ్బంది హుటాహుటిన ప్రమాద స్థలానికి చేరుకుని, సరుకు రవాణా నౌకలోని సిబ్బందిని కాపాడారు. ఈ నౌకలో 464 కంటెయినర్లు ఉన్నాయి. 10,683 మెట్రిక్ టన్నుల సరుకును తీసుకెళ్తోంది. ఈ ప్రమాదంలో ఈ సరుకంతా దెబ్బతింది.

## పేద ముస్లిం మహిళలకు చీరల పంపిణీ

**రాజధాని ప్రతినిధి, విజయవాడ :** పవిత్ర రంజాన్ మాసంలో షబేఖదర్ నేపథ్యంలో వైసీపీ రాష్ట్ర కార్యదర్శి షేక్ ఆసీఫ్ వించిపేటలోని తన కార్యాలయం వద్ద పేద మహిళలకు చీరల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రంజాన్‌మాసంలో పవిత్రమైన రాత్రి షబేఖర్‌ను పురస్కరించకుని ప్రతి ముస్లిం నూతన వస్త్రాలు ధరించి నమాజ్ (ప్రార్థనలు) చేస్తారని తెలిపారు. నాలుగు సంవత్సరాలుగా రంజాన్ మాసంలో ముస్లిం మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ముస్లిం సోదరులు ఆనందంగా గడపాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నగర అధికార ప్రతినిధి ఏలూరు వెంకన్న, బీసీసెల్ నగర కార్యదర్శి ఆర్.వెంకట్, ఎస్సీసెల్ నగర ప్రధాన కార్యదర్శి గద్దెల లాజర్, స్థానిక మైనారిటీ నాయకులు మన్సూర్, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

# చేపల వేట సందిగ్ధమే...!

**రాజధాని ప్రతినిధి, విశాఖపట్నం :** రెండు నెలల విరామం తర్వాత సముద్రంలో ఈ నెల 14 నుంచి ప్రారంభంకావాల్సిన చేపట వేటపై మీమాంస నెలకొంది. వేటపై నిషేధాన్ని సడలించినా వేటకు వెళ్లేందుకు బోటు యజమానులు, కళాసీలు (బోటులో చేపలు పట్టే వృత్తిదారులు) ససేమిరా అంటున్నారు. దీర్ఘకాలంగా పేరుకుపోతున్న తమ సమస్యలు పరిష్కరిస్తే తప్ప చేపల వేటను ప్రారంభించేదిలేదని తెగేసి చెప్పేస్తున్నారు. ఇటీవల డీజిల్ ధరలు పెరిగిందన తమకు సబ్సిడీని పెంచాలని బోటు యజమానులు, వేట ఆదాయంలో తమకు 12 శాతం వాటా ఇవ్వాలని కళాసీలు పట్టుబడుతున్నారు. దీంతో వేట నిషేధాన్ని సడలించినా, బోట్లు ఒడ్డుకు పరిమిత మయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. రాష్ట్రంలోని పది తీర ప్రాంతాల్లో ఉన్న బోటు ఆపరేటర్ల సంఘాలన్నీ ఏకమయ్యాయి. డీజిల్ సబ్సిడీ పెంపుపై ప్రభుత్వంతో తేల్చుకున్నాకే సముద్రంలో చేపలు, రొయ్యల వేటకు వెళ్లాలని సంఘాలు నిర్ణయించారు. ఈ నేపథ్యంలో రాజధాని అమరావతిలో మత్స్యశాఖ ఉన్నతాధి కారుల సమావేశం జరగనుంది. ఆ సమావేశంలో బోటు యజమానుల డీజిల్ సబ్సిడీ పెంపు, కళాసీల వేట సంపదలో వాటా పెంపు అంశాలపై ప్రధానంగా చర్చించనున్నారు. స్థానిక ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ నేతృత్వంలో క్రీడలు, యువజన సర్వీసులశాఖ మంత్రి కొల్లు రవీంద్ర ద్వారా తమ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కళాసీలు, బోటు యజమానులు భావిస్తున్నారు. అధికారుల సమావేశం పూర్తయిన తర్వాత వీరంతా మంత్రి ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబును కలిసి వినతిపత్రాన్ని అందజేయనున్నారు.

**వేటకెళితే రూ.2.10 లక్షల వ్యయం**

ఒక మర బోటు ఒకసారి సముద్రంలో వేటకు వెళితే సుమారు రూ.2.10 లక్షల ఖర్చవుతోంది. కేవలం డీజిల్ కోసమే దీనిని ఖర్చు పెట్టాల్సి ఉండగా, బోటులో చేపలు, రొయ్యలు పట్టేందుకు వచ్చే కళాసీల ఖర్చు అదనమని బోటు యజమానులు చెబుతున్నారు. ఒక మర పడవ వేటకు వెళితే 20 రోజులపాటు సముద్రంలోనే ఉంటుందని, ఇందుకు సుమారు మూడు వేల లీటర్ల ఇంధన అవసరమని యజమానులు చెబుతున్నారు. ఈ లెక్కల ప్రభుత్వం ఇచ్చే రాయితీ పోనూ రూ.2.10 లక్షలను కేవలం డీజిల్‌కే ఖర్చు చేయాల్సి వస్తోందంటున్నారు ఇంత భారీ పెట్టుబడితో వేటకు వెళ్లినా నష్టాలే వస్తున్నాయని వాపోతున్నారు. రోజూ పెరుగుతున్న డీజిల్ ధరలు చేపల వేటపై తీవ్ర ప్రభావానే చూపుతున్నాయి. డీజిల్ లీటరు ధర రూ.36గా ఉన్నప్పుడు ఎంత సబ్సిడీని ప్రభుత్వం ఇచ్చిందో, ధర రూ.76కు చేరినా అదే సబ్సిడీ ఇవ్వటంపై బోటు యజమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డీజిల్ సబ్సిడీని రూ.6 నుంచి రూ.12కి పెంచాలని వీరంతా ఎప్పటి నుంచో డిమాండు చేస్తున్నారు. అధికారులు సమస్యను మత్స్యశాఖ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం శూన్యం. దీంతో దీనిపై ఏదోకటి తేల్చుకునేందుకు బోటు యజమానులు సిద్ధమయ్యారు. డీజిల్ రాయితీ పెంచకపోతే భవిష్యత్ కార్యాచరణకు దిగేందుకు మత్స్య కార్మిక సంఘాలు సమాయత్తం అవుతున్నాయి. 2008 లో లీటరు డీజిల్‌పై రాష్ట్ర ప్రభుత్వం రూ.6, కేంద్రం రూ.3 సబ్సిడీ ఇచ్చేవని బోటు యజమానులు చెబుతున్నారు. అయితే ఐదేళ్లగా కేంద్రం తన వాటాను నిలిపివేసింది. ఆ తర్వాత రాష్ట్ర ప్రభుత్వం అమ్మకం పన్ను నుంచి మినహాయింపు ఉసహా లీటర్‌కు రూ.6 రాయితీ ఇస్తోంది. అది కూడా తొమ్మిదో పంచవర్ష ప్రణాళికలో నిర్మించిన బోట్లకు మాత్రమే పరిమితం కావటం గమనార్హం. విశాఖ ఫిషింగ్ హార్బర్‌లోని



320 బోట్లకు మాత్రమే రాయితీ అందుతోందని, ఇతర 11 జట్టీల్లోని 700 మర బోట్లు, 120 ఇంజన్ బోట్లతోపాటు తెప్పలకు కూడా రాయితీ ఇవ్వాలని గంగ పుత్రులు కోరుతున్నారు. ప్రభుత్వం మెకనైజ్డ్ బోట్లకు నెలకు మూడు వేల లీటర్ల డీజిల్‌ను, మోటారు బోటుకు 300 లీటర్లు డీజిల్‌ను సరఫరా చేస్తుంది. ఇందుకోసం రూ.5 కోట్ల బడ్జెట్‌ను కేటాయించగా, ఈ ఏడాది దానిని రూ. 17.5 కోట్లకు ప్రభుత్వం పెంచింది. రాష్ట్రంలో 700 మెకనైజ్డ్ బోట్లు, మూడు వేలు మోటారు బోర్డు మాత్రమే డీజిల్ రాయితీని పొందుతున్నటున్న యజమానుల సంఘాలు చెబుతున్నాయి.

12శాతం వాటా కోసం కళాసీల పట్టు

సముద్రంలో బోటు చేపల వేటకు వెళ్లాలంటే కళాసీలు, డ్రైవర్ల పాత్ర కీలకం. అలాంటి కళాసీలు, డ్రైవర్లు తమ వాటాను కూడా పెంచాలని డిమాండు చేస్తున్నారు. వేట సంపదలో ప్రస్తుతం ఇస్తున్న వాటాను 10శాతం నుంచి 12 శాతానికి పెంచాలనేది వీరి ప్రధాన డిమాండు. రాష్ట్ర వ్యాప్తంగా 60 వేల మంది కళాసీలుండగా, ఒక్క విశాఖపట్నం ఫిషింగ్ హార్బర్‌లోనే ఎనిమిది వేల మంది ఉన్నారు. వీరంతా ఏఐటీయూసీ అనుబంధ విశాఖపట్నం ఫిషింగ్ హార్బర్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో వాటా పెంపునకు పోరాటం చేస్తున్నారు. వేటకు వెళ్లి ఎంతో కష్టపడుతుంటే, కేవలం పది శాతం వాటా ఇస్తే తమ కుటుంబాలు ఎలా జీవించాలని వారు ప్రశ్నిస్తున్నారు. తమ న్యాయమైన డిమాండును అమలు చేయాలని వారు కోరుతున్నారు.

**నేటికీ అందని భృతి**

ఏప్రిల్ 14 నుంచి జూన్ 14 వరకు సముద్రంలో వేటను నిలుపుదల చేసినందుకు ప్రభుత్వం మత్స్యకారులకు రూ.4 వేలు భృతిని ఇవ్వాల్సి ఉంది. కాని ఈ ఏడాది వేట నిషేధానికి సంబంధించిన భృతి నేటికీ అందలేదని మత్స్యకారులు తెలిపారు. ప్రభుత్వం ఇచ్చే అసలు చాలదని మత్స్యకార్మిక సంఘాలు వాపోతున్నాయి. విశాఖ ఫిషింగ్ హార్బర్ నుంచి 18,277 మందికి భృతి ఇవ్వాలని అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదించారు. ఇందులో శ్రీకాకుళం, విశాఖ రూరల్‌లోనూ నమోదైన వారి పేర్లు ఉంటే తొలించేస్తామని మత్స్యశాఖ ఏడీ లక్ష్మణరావు తెలిపారు. ఈ భృతిని నేరుగా లబ్ధిదారుల ఖాతాలో జమ చేస్తామని, రెండో మూడు రోజుల్లో ఇది పూర్తవుతుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఐదు లక్షల మంది మత్స్యకార కుటుంబాలుండగా, కేవలం 60 వేల మందికే దీనిని పరిమితం చేయటంపై మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## ప్రభుత్వ బడికి పోదాం..

(మొదటిపేజీ తరువాయి)

చదువుతుండగా, 150 మున్సిపల్ జిల్లా పరిషత్ పాఠశాలల్లో 40 వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కంటే నగర, పట్టణ ప్రాంతాల్లో ప్రైవేటు స్కూళ్లు ఎక్కువగా ఉన్నాయని రవికుమార్ చెబుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యకోసం ఏడాదికి రూ. 20 వేల కోట్లు ఖర్చుచేస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పరీక్షలు నిర్వహించి ఉత్తమ అభ్యర్థులను ఉపాధ్యాయులుగా నియమిస్తోందని, ఒత్తిడి లేని వాతావరణంలో చదువుకునేందుకు ప్రభుత్వ పాఠశాలలు అనువుగా ఉంటాయన్నారు.

అంచనాల ప్రకారం 29 శాతం బాలలు పేదరికంతో బడి ముఖం చూడటం లేదు. దీంతో 30 మందికంటే తక్కువ ఉన్న పాఠశాలను దగ్గర్లోని పాఠశాలల్లో ఐక్యం చేస్తూ ప్రభుత్వం జీవో జారీచేసింది. గుంటూరు జిల్లాలోని 21,197 ప్రాథమిక పాఠశాలల్లో 97,675 మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రభుత్వం వారికోసం 566 మోడల్ స్కూళ్లను ఏర్పాటు చేయడానికి సంకల్పించింది. ఇందుకోసం ఐదుగురు టీచర్లనుకూడా నియమించారు. ఈ ప్రతిపాదన విజయవంతం అయితే జిల్లాలోని 3,217 మంది టీచర్లకు పనిలేకుండా పోతుంది. ఈనెల 12 నుంచి బడిబాట వారోత్సవం నిర్వహిస్తున్నామని ఇందులో తమ పిల్లలను స్కూలుకు పంపే విధంగా తల్లిదండ్రులకు అవగాహనకల్పిస్తామని జిల్లా విద్యాధికారి ఆర్ఎస్ గంగా భవాని వెల్లడించారు.

## వేరే పార్టీతో పొత్తు ప్రశ్నే లేదు

**కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల బాధ్యుడు ఊమెన్ చాందీ**



**రాజధాని ప్రతినిధి, అమరావతి :** వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో వేరే పార్టీతో పొత్తు ప్రశ్నే లేదని రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల బాధ్యుడు ఊమెన్ చాందీ స్పష్టం చేశారు. పార్టీలతో కాదు ప్రజలతోనే మా పొత్తు... అదే 2019లో మా ఎన్నికల నినాదం..' అని వెల్లడించారు. ఏపీకి ప్రత్యేకహోదా ఇస్తామని పార్లమెంట్‌లో... బయటా యూపీఏ హయాంలో మేం హామీనిస్తే మోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా అమలు చేయడం లేదని విమర్శించారు. దాదాపు నాలుగేళ్లపాటు భాగస్వామిగా ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్డీయే ప్రభుత్వంపై ఒత్తిడి చేయలేదన్నారు. తన తప్పును కప్పి పుచ్చుకునేందుకే కాంగ్రెస్సే దోషి, ఆ పార్టీ వల్లే రాష్ట్రానికి అన్యాయం జరిగిందంటూ మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. ఆయన ఆంధ్రరత్నభవన్‌లో ఏపీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి, ఇతర సీనియర్ నేతలతో కలిసి విలేకరులతో మాట్లాడారు. 'భాజపా అన్ని విషయాల్లోనూ మోసం చేస్తోంది. ప్రజల్లో ఎంతో అసంతృప్తి నెలకొంది. వారు మార్పు కోసం చూస్తున్నారు..' అని వెల్లడించారు.

**వాడివేడిగా ఏపీసీసీ కార్యవర్గ సమావేశం**

రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల బాధ్యుడు ఊమెన్ చాందీ ఆధ్వర్యంలో ఆంధ్రరత్న భవన్‌లో జరిగిన ఏపీసీసీ కార్యవర్గ సమావేశం వాడివేడిగా కొనసాగింది. పార్టీ బలోపేతానికి సహకరించని వారిపై కఠినంగా వ్యవహరిస్తానని ఏపీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి చెప్పారు. మాజీ సభాపతి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ అభ్యర్థుల ఎంపికపై దృష్టి పెట్టాలన్నారు. మాజీ ఎంపీ చింతమోహన్ మాట్లాడుతూ పార్టీలో దళితులకు నాయకత్వం ఇవ్వాలన్నారు. పలువురు రఘువీరా పని తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. నాయకులందరికీ లక్ష్యాలను నిర్ధేశించాలని పలువురు కార్యవర్గ సభ్యులు విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర, జిల్లా, మండల, బూత్ స్థాయిల్లో కమిటీలను బలోపేతం చేయాలని... అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలకు అభ్యర్థులను ఖరారు చేయాలని... ఇవన్నీ జూన్ 15 నుంచి సెప్టెంబరు 30 లోగా పూర్తి చేయాలంటూ చాందీ నేతలకు కార్యాచరణను నిర్ధేశించారు. రాహుల్‌గాంధీ 48వ జన్మదినాన్ని పురస్కరించుకుని 'ఏపీకి ప్రత్యేకహోదా రావాలన్నా.. బడుగు బలహీన వర్గాలకు న్యాయం జరగాలన్నా రాహుల్‌తోనే సాధ్యం... అన్న నినాదంతో 19న రాష్ట్రవ్యాప్తంగా కార్యక్రమాలు చేపట్టాలని తీర్మానించారు.

## 7 రోజుల్లో వివాహాలు నమోదు

**లేదంటే ఎన్ఆర్ఐల పాస్‌పోర్టు, వీసా జారీ రద్దు**



**ఢిల్లీ :** ఎన్ఆర్ఐలు పెళ్లైన ఏడు రోజుల్లోపు తమ వివాహ రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుందని మహిళా, శిశు సంక్షేమ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. అలా చేయని పక్షంలో వారికి పాస్‌పోర్టు, వీసాలు జారీ చేయబోమని సదరు మంత్రిత్వ శాఖ తెలిపింది. ఎన్ఆర్ఐలను పెళ్లి చేసుకున్న మహిళలపై పెరుగుతున్న దాడులను నియంత్రణలోకి తీసుకొచ్చే దానిపై జరిగిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. కేంద్రమంత్రులు మేనకాగాంధీ, సుష్మా స్వరాజ్, రాజ్‌నాథ్ సింగ్, రవిశంకర్ ప్రసాద్ ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఎన్ఆర్ఐలను వివాహమాడిన మహిళలు ఎదుర్కొంటున్న చట్టపరమైన సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారు. త్వరలోనే దీన్ని అమల్లోకి తీసుకురానున్నారు.

ఈ సమావేశంలో ఎన్ఆర్ఐ భర్తల ఆస్తులను స్వాధీనం చేసుకునే విషయంపైనా మంత్రుల బృందం చర్చించినట్లు తెలుస్తోంది. భారత్‌లో ఇప్పటి వరకు వివాహ నమోదుకు కచ్చితమైన సమయమంటూ ఏదీ లేదు. పెళ్లైన తర్వాత ఎప్పుడైనా రిజిస్ట్రేషన్ చేసుకునే సదుపాయం ఉంది. ఇక మీదట పెళ్లైన 30 రోజుల్లోగా వివాహాన్ని నమోదు చేసుకోవాలని లేదంటో రోజు రూ.5చొప్పున జరిమానా విధించాలనే ప్రతిపాదనను లా కమిషన్ ప్రతిపాదించింది. ఎన్ఆర్ఐ వివాహాలు జరిగిన 48గంటల్లోపు సమీప రిజిస్ట్రార్ కార్యాలయంలో నమోదు చేసుకోవాలనే విధానాన్ని తీసుకొస్తామని కేంద్రమంత్రి మేనకాగాంధీ ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే.. తాజాగా 48గంటలు కాకుండా ఏడు రోజుల్లోపు నమోదు ప్రక్రియ జరగాల్సిందిగా సరికొత్త ఆదేశాలు తీసుకొస్తున్నారు.

ఎన్ఆర్ఐ వివాహాల్లో ఉమ్మడి రాష్ట్రం విజయవాడలో 2010 జనవరిలో జరిగిన పలగాని నాగవైష్టవి హత్య కేసు తుది తీర్పు ఎనిమిదేళ్ల తర్వాత వెల్లడైంది. బీసీ సంఘం నేత, మద్యం వ్యాపారి పలగాని ప్రభాకర్ తన అక్క కూతురు వెంకటరామమ్మను చేసుకున్నాడు. వారికి దుర్గాప్రసాద్ అనే కుమారుడు ఉన్నాడు. కొన్నాళ్లకు ప్రభాకర్ నిజామాబాద్ జిల్లాకు చెందిన నర్మదను రెండో పెళ్లి చేసుకున్నాడు. ఈ దంపతులకు సాయితేజష్, నాగవైష్టవి సంతానం. పాప వైష్టవి పుట్టిన తరువాతే తన దశ తిరిగిందన్నది ప్రభాకర్ నమ్మకం. గారాలపట్టి వైష్టవి పేరుతో ఆస్తులన్నీ పెడుతున్నాడన్న భావన మొదటి భార్య సోదరుడు పంది వెంకటరావులో బలంగా ఏర్పడింది. దీంతో వైష్ణవిని చంపాలని నిర్ణయించుకున్న వెంకటరావు, తన చిన్నమ్మ కొడుకు శ్రీనివాసరావుతో కోటి రూపాయలకు ఒప్పందం చేసుకున్నాడు. జనవరి 30న చిన్నారి వైష్ణవిని కిడ్నాప్ చేసి చంపేశారు. తర్వాత ఆమె శవాన్ని బాయిలర్‌లో వేసి బూడిద చేశారు.

## భారత్‌లో పితృత్వ సెలవులు లేవు

**యునిసెఫ్ వెల్లడి**

**ఢిల్లీ :** ఉద్యోగం చేసే మహిళ బిడ్డకు జన్మనిస్తే ఆ చిన్నారి సంరక్షణ నిమిత్తం ఆమెకు వేతనంతో కూడిన మాతృత్వ సెలవులు ఇస్తారు. మన దేశంలో ఇటీవలే ఈ సెలవులను 26 వారాలకు పెంచుతూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అయితే మాతృత్వ సెలవుల మాదిరిగానే పితృత్వ సెలవులు అనేది చాలా అరుదుగా వినిపించే మాట. ఉద్యోగం చేసే పురుషుడు తండ్రయితే అతడు వేతనంతో కూడిన సెలవులు పొందే వెసులుబాటు మన దేశంలో లేదు. అయితే కేవలం భారత్‌లోనే కాదు.. ప్రపంచవ్యాప్తంగా 90కి పైగా దేశాల్లో వేతనంతో కూడిన పితృత్వ సెలవులు లేవట. ఈ మేరకు యునిసెఫ్ అధ్యయనం వెల్లడించింది.

భారత్, నైజీరియా సహా 92 దేశాల్లో ఉద్యోగం చేసే పురుషులకు వేతనంతో కూడిన పితృత్వ సెలవులు ఇచ్చేందుకు ఎలాంటి జాతీయ విధానాలు లేవని యునిసెఫ్ తమ అధ్యయనంలో పేర్కొంది. అగ్రరాజ్యమైన అమెరికా సహా ఎనిమిది దేశాల్లో మాతృత్వ, పితృత్వ సెలవులు ఇస్తున్నప్పటికీ.. వాటికి ఎలాంటి వేతనం చెల్లించబోరని యునిసెఫ్ తెలిపింది. ప్రస్తుతం బ్రెజిల్, కాంగో లాంటి దేశాల్లో వేతనంలో కూడిన పితృత్వ సెలవులు ఇస్తున్నాయి.

'బిడ్డ పుట్టిన క్షణం నుంచి తల్లిదండ్రులిద్దరూ ఆ చిన్నారితో సమయం గడపడం వల్ల ఆ పిల్లల మెదడులో పెరుగుదల వేగంగా ఉంటుంది. అది వారిని ఆనందంగా, ఆరోగ్యంగా ఉంచుతుంది. బిడ్డ పుట్టినప్పటి నుంచి తండ్రి తన బంధాన్ని బలపర్చుకోవడం వల్ల ఆ బిడ్డ ఎదుగుదలలో కీలక పాత్ర పోషించగలడని అనేక అధ్యయనాలు చెబుతున్నాయి. తల్లిదండ్రులతో సానుకూల వాతావరణంలో పెరిగిన పిల్లల్లో మానసిక ఆరోగ్యం, ఆత్మ గౌరవడం, జీవిత సంతృప్తి ఎక్కువకాలం ఉంటాయని అధ్యయనాలు వెల్లడించాయి. కాబట్టి ఉద్యోగం చేసే తల్లిదండ్రులకు ఆ అవకాశం కల్పించడం మనందరి బాధ్యత. అన్ని దేశాల ప్రభుత్వాలను మేం ఇదే కోరుతున్నాం. బిడ్డతో తల్లిదండ్రులు సమయం గడిపేందుకు వారికి వేతనంతో కూడిన సెలవులు ఇవ్వండి' అని యునిసెఫ్ పేర్కొంది.

## ఆ లేఖ నకిలీది...

- ప్రధాని హత్యకు కుట్ర ఉత్తిదే...!
- సుప్రీం, హైకోర్టు మాజీ జడ్జీల సంచలన వ్యాఖ్యాలు

**ముంబై :** ప్రధాని మోడీ హత్యకు మావోయిస్టులు కుట్ర పన్నారనే లేఖ నకిలీదని, అది ప్రచార స్టంటేనని సాక్షాత్తూ సుప్రీం, హైకోర్టు మాజీ జడ్జీలు చేసిన వ్యాఖ్యాలు ప్రసుత్తం దుమారం రేపుతున్నాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోడీని హత్య చేసేందుకు మావోయిస్టులు కుట్ర పన్నారంటూ ఇటీవల వెలువడిన లేఖ నకిలీదని ఎల్గార్ పరిషత్‌కు చెందిన సుప్రీంకోర్టు మాజీ జడ్జి జస్టిస్ పీబీ సావంత్ ,హైకోర్టు మాజీ జడ్జి బీజీ కేల్సే పాటిల్ వ్యాఖ్యానించారు. తాను ఆ లేఖను స్వయంగా చూడకపోయినా, మీడియాలో వచ్చిన దాన్ని బట్టి అది నకిలీ లేఖలా కనిపించిందని సావంత్ వ్యాఖ్యానించారు. పోలీసులు పేర్కొంటున్న లేఖ ప్రామాణికతపై హోంశాఖ అధికారులు దర్యాప్తు చేయాలని జస్టిస్ సావంత్ కోరారు. మోడీ హత్యకు కుట్ర పన్నారని లేఖను పేర్కొనడం ప్రచారం కోసమేనని పాటిల్ ఆరోపించారు. "గతంలో జడ్జీగా నేనెన్నో తీర్పులు ఇచ్చాను. మావోయిస్టులు రాసినట్లుగా పేర్కొంటున్న లేఖకు విలువ లేదు. నిజంగా అయితే రహస్యంగా ఎందుకు ఉంచలేదు...ఇది కేవలం ప్రచారం జిమ్మిక్కు మాత్రమే...కోర్టు ఆధీనంలో ఉన్న ఈ లేఖ వెంటనే బీజేపీ అధికార ప్రతినిధి వద్దకు ఎలా చేరింది". అని జస్టిస్ పాటిల్ ప్రశ్నించారు. ఈ లేఖపై పోలీసులు సమగ్ర దర్యాప్తు చేయాలని ఆయన డిమాండు చేశారు. మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీని ఎల్‌టీటీఈ శ్రీ పెరంబదూర్‌లో ఆత్మాహుతి దాడితో హత్య చేసిన రీతిలోనే మోడీని కూడా అంతమొందించాలని మావోయిస్టు సానుభూతిపరుల వద్ద లభ్యమైన ఓ లేఖలో ఉన్నట్లు పోలీసులు ఇటీవల వెల్లడించారు. మహారాష్ట్రలోని భీమ–కొరెగాంలో జనవరి 1న జరిగిన హింసకు సంబంధించి పోలీసులు బుధువారం దళిత నేత సుధీర్ ధార్వాలే, న్యాయవాది సురేంద్ర గాడ్లింగ్స్, మహేశ్ రౌత్, షోమా సేన్, రోనా విల్సన్ అనే ఐదుగురు వ్యక్తులను నాగ్‌పూర్, ముంబై , ఢిల్లీలో అరెస్టు చేశారు. వీరికి మావోయిస్టులతో సంబంధాలున్నట్లు ఆరోపణ. అందులో ఒకరైనా రోనా విలన్స్ అనే వ్యక్తి నివాసంలో లభించిన లేఖలో ఈ కుట్ర విషయం ఉందని ఆ ఐదుగురినీ పుణె కోర్టులో హాజరుపర్చిన సమయంలో మహారాష్ట్ర పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఉజ్వల పవార్ తెలిపారు.

# హిజాబ్ నిబంధనపై భారత క్రీడాకారిణుల విముఖత

ఆమె







కొంగు కప్పుకోవడం ఉత్తర భారతదేశంలో ఒక ఉత్తమ సంప్రదాయంగా పరిగణిస్తారు. పెద్దల ముందు, లేదా ప్రజల ముందుకు వెళుతున్నప్పుడు తలపై ముసుగు వేసుకోవడం వారికిస్తున్న గౌరవంగా భావిస్తారు. విదేశీయులు ఫ్యాషన్‌గా కూడా హిజాబ్ ధరిస్తారు.

ప్రస్తుతం చాలా మంది యువతులు తలపై స్కార్ఫ్ వేసుకొని ఒక్క కళ్లను మాత్రమే బయటికి ఉంచి ఎండ, కాలుష్యం బారి నుంచి రక్షణ పొందుతున్నారు. ఒకప్పుడు ఇలాంటి వస్త్రం లేదా ముసుగును ముస్లింలు మాత్రమే ధరించేవారు. ముస్లిం దేశాల్లో హిజాబ్ ధరించడం తప్పనిసరి. మగవారి చెడు చూపుల నుంచి రక్షణ పొందటానికి హిజాబ్ వేసుకోవాలని మహ్మద్ ఆదేశించారని ఆయా దేశాల మత పండితులు చెబుతుంటారు. ఇరాన్‌లో నిర్వహించబోయే 'ఏషియన్ టీమ్ చెస్ చాంపియన్‌షిప్'లో పాల్గొనడంలేదని మాజీ వరల్డ్ జూనియర్ గర్ల్స్ చాంపియన్, ఉమెన్ గ్రాండ్ మాస్టర్ సౌమ్య స్వామినాథన్ ప్రకటించారు. జులై 26 నుంచి ఆగస్టు 6 వరకూ ఇరాన్‌లోని హమదాన్‌లో నిర్వహించబోయే ఈ టోర్నీ నుంచి తాను తప్పుకుంటున్నట్లు తెలిపారు. ఇరాన్ దేశంలో ఉన్న 'తలకు తప్పనిసరిగా స్కార్ఫ్ ధరించాల'నే నిబంధన వల్ల తాను ఈ టోర్నీ నుంచి తప్పుకుంటున్నట్లు ఆమె ఫేస్‌బుక్‌లో పోస్టు చేశారు.

'ఇరానీ చట్టాలలో మహిళలు తప్పనిసరిగా తలపై స్కార్ఫ్ లేదా బురఖా ధరించాలనే నియమం ఉంది. కానీ ఇలా బలవంతంగా స్కార్ఫ్ లేదా బురఖా ధరించడం అంటే నా స్వేచ్ఛకు ఆటంకం కల్గించడమే అవుతుంది. ఇలా చేస్తే నా హక్కులకు, నా మతానికి గౌరవం ఇవ్వనట్లే అవుతుంది. అందుకే నేను ఇరాన్ వెళ్లకూడదని నిర్ణయించుకున్నాను. టోర్నీలో భాగంగా మమ్మల్ని నేషనల్ టీం డ్రస్ కానీ, ఫార్మల్స్ కానీ, లేదా మరేదైనా స్పోర్ట్స్ డ్రస్ వేసుకోమని కోరితే మేము సంతోషంగా ఒప్పుకునేవాళ్లము. అంతేకాని ఇలా మతపరమైన నియమాలను ఆటగాళ్ల మీద బలవంతంగా రుద్దడం సరైంది కాదు. అని ఆమె పోస్టు చేశారు.

2016లో ఇరాన్‌లో నిర్వహించిన 'ఏషియన్ ఎయిర్‌గన్ మీట్' నుంచి ఇండియా 'టాప్ షూటర్', దంతవైద్యురాలు హీనా సింధూ కూడా ఇలానే పోటీ నుంచి తప్పుకున్నారు. అప్పుడు కూడా తలపై స్కార్ఫ్ ధరించాలనే నియమమే ఇందుకు కారణం.

నిజానికి ఉత్తర,దక్షిణ భారత దేశంలో స్కార్ఫ్‌ను కట్టుకునే ముస్లింమేతరులు తక్కువగా ఏమీ లేరు. హైదరాబాద్ , విజయవాడ, విశాఖ వంటి పట్టణాలలోనే కాకుండా ఇతర రాష్ట్రాల మెట్రోరాష్ట్రాల్లో వీటిని ధరించేవారు చాలా మందే ఉన్నారు. అయితే క్రీడాకారులు హక్కులను పరిరక్షించాల్సిన అవసరం ఉందన్నది కాదనలేనిసత్యం. కొత్తగా వాటిని ధరించడం వల్ల ఆటపై ఏకాగ్రత కోల్పోతారు. ఇకపై దీనిని ఇరాక్ ప్రభుత్వం గుర్తిస్తుందని ఆశిద్దాం.

## ఉద్యమాలతోనే ప్రత్యేక హోదా : చలసాని



**ఒంగోలు :** ఉద్యమాలతోనే ఏపీకి ప్రత్యేక హోదాతో పాటు విభజన చట్టంలోని హక్కులను సాధించుకోవచ్చని, ప్రత్యేక హోదా, విభజన హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు చలసాని శ్రీనివాసరావు స్పష్టం చేశారు. నిర్వహించిన మీడియా సమావేశానికి భారత కమ్యూనిస్టు పార్టీ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ అధ్యక్షత వహించారు. సమావేశంలో పాల్గొన్న చలసాని శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రాణాలను ఫణంగా పెట్టి ఉద్యమాలు నిర్వహించడం వల్లే విభజన చట్టంలోని కొన్ని అంశాలయినా అమలవుతున్నాయన్నారు. భావితరాలు, రైతులు, అగ్రిగోల్డ్, వైద్య విద్య రంగాలలోని సమస్యలు పరిష్కారం అయ్యేవరకు ఉద్యమాలు చేపడతామన్నారు. రైల్వే తెలుగువారికి బడ్జెట్‌లో రూ.5,600 కోట్లు కేటాయించి, మహారాష్ట్రకు రూ.57వేల 668 కోట్లు ఎలా కేటాయించారో బీజేపీ చెప్పాలన్నారు. గుజరాత్‌కు మోడీ రూ.75వేల కోట్లతో బుల్లెట్ రైల్, యూనివర్సిటీ, బొలేరా సిటీలను వేల కోట్లతో కట్టారని భారత దేశమంటే కేవలం గుజరాత్ మాత్రమే కాదన్నారు. ఉద్యమాల వేడితో కడప ఉక్కు ఫ్యాక్టరీ, రైల్వే జోన్ ఇచ్చేందుకు కేంద్రం ముందుకు వచ్చిందని, అన్ని రాజకీయ పార్టీలు తమ రాజకీయ ఎజెండాలు పక్కన పెట్టి ప్రత్యేక హోదా ఉద్యమంలోకి రావాలన్నారు. సీపీఎం తూర్పు ప్రకాశం జిల్లా కార్యదర్శి పూనాటి ఆంజనేయులు మాట్లాడుతూ ప్రత్యేక హోదాకోసం సాధన సమితి ఆధ్వర్యంలో హోదాతోపాటు ప్రకాశం జిల్లా వెనుక బడిన జిల్లాగా ప్రకటించే వరకు ఉద్యమాలు నిర్వహిస్తామన్నారు. ఏపీడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు ఐవీసుబ్బారావు మాట్లాడుతూ ప్రత్యేక హోదా కోసం మొదటి నుంచి జర్నలిస్టులు తమ మద్దతు తెలుపుతున్నారన్నారు. రాజకీయ పార్టీల పక్షాన కాకుండా సాధన సమితి పిలుపు అందుకొని ఉద్యమిస్తామన్నారు. సినీ సంగీత దర్శకులు మూత్తూజ్ మాట్లాడుతూ ఉద్యమాలలో కళాకారుల పాత్ర కీలకమైనదని, అభ్యుదయ శక్తులన్నీ ముందుకు రావాలన్నారు. అనంతరం ఆయన ప్రత్యేక హోదా గీతాన్ని ఆలపించి అలరించారు. మేధావుల సంఘం నుండి డాక్టర్ సుబ్బారావు ప్రసంగించారు.

## కళాశాలల్లోనూ,మధ్యాహ్న భోజనం

- **జులై 1 నుంచి ప్రభుత్వం ఎయిడెడ్ జూనియర్ కళాశాలల్లో పథకం అమలు**
- **15 వేల మందికి పైగా విద్యార్థినీ విద్యార్థులకు లబ్ధి**

**రాజధాని ప్రతినిధి, గుంటూరు(విద్య), :** మధ్యాహ్న భోజన పథకాన్ని జూనియర్ కళాశాలల్లో కూడా అమలుచేయడానికి ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. దీనికి సంబంధించి ఇప్పటికే విధి విధానాలు పరిశీలనపై దృష్టి సారించారు. ఇప్పటికే ప్రభుత్వ, జడ్పీ, ఎయిడెడ్ పాఠశాలల్లో విద్యార్థినీ విద్యార్థులకు ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తున్న విషయం తెలిసిందే. ఇదే పద్ధతిని జూనియర్ కళాశాలల్లో ప్రవేశ పెట్టనున్నారు. జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు 22, ఎయిడెడ్ జూనియర్ కళాశాలలు 23 ఉన్నాయి. ఆయా కళాశాలల్లో ఎంపీసీ, బైపీసీ, హెచ్ఈసీ, ఎంఈసీ, ఇతర వృత్తి విద్యాకోర్సుల్లో మొదటి సంవత్సరం దాదాపు 9వేల వరకు అడ్మిషన్లు రానున్నాయి.ఇప్పటికే ద్వితీయ సంవత్సరం విద్యార్థినీ విద్యార్థులు సుమారు 7వేల మంది ఉన్నారు. అంటే పథకం అమలైతే 15 నుంచి 16 వేల మంది విద్యార్థినీ విద్యార్థులు లబ్ధి పొందే అవకాశం ఉంది. ప్రభుత్వ, జూనియర్ కళాశాలల్లో చదివే విద్యార్థుల్లో అత్యధికులు పేద, దిగువ మధ్యతరగతికి చెందిన వారే . తల్లిదండ్రులు కూలీ నాలీ చేసుకుంటూ పిల్లల్ని చదివిస్తుంటారు. ఉదయం పూట హడావిడిగా భోజనం చేసి వస్తున్నారు. మధ్యాహ్నం అనేక మంది భోజనం తీసుకుని రావడం లేదు. ఒక వేళ తీసుకువచ్చినా ఏదో నామమాత్రంగానే ఉంటోది.పరీక్షల సమయంలో అయితే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడే సంఘటనలు ఉన్నాయి.స్టడీ అవర్స్ కోసం ఉదయం 8 గంటలకు కళాశాలకు వస్తే సాయంత్రం 7 గంటలకు తిరిగి వెళ్తుంటారు. విద్యార్థినుల ఆకలిబాధ చూడలేక గుంటూరు ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో అధ్యాపకులు స్వచ్ఛందంగా మూడూ నెలలపాటు మధ్యాహ్న భోజనం విద్యార్థులకు ఏటా అందిస్తున్నారు. తాజాగా ప్రభుత్వం జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలుకు ముందుకు రావడం పట్ల అధ్యాపకులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## వర్షాలకు వజ్రాలు



**కర్నూలు :** కర్నూలు జిల్లాలో తొలకరి చినుకులకు వజ్రాలు రాలుతున్నాయంటూ ప్రచారం జరగడంతో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు పొలాల్లో తిష్ట వేశారు. వజ్రాల కోసం వేట మొదలు పెట్టారు. కుటుంబ సమేతంగా వజ్రాల కోసం వెతుకులాటలో నిమగ్నమయ్యారు. జిల్లాలోని తుగ్గలి మండలం ఇతర ప్రాంతాల నుంచి వారితో సందడిగా మారింది. ఇక్కడ ఉన్న ఎర్రటి నేలల్లో వజ్రాల కోసం ప్రజలు అన్వేషిస్తున్నారు.రాత్రి వర్షం కురిస్తే ఉదయం ఆరు గంటల నుంచి సాయంత్రం వరకు చూపు పక్కకు తిప్పకుండా వెతుకుతున్నారు. తొలకరి సమయాల్లో తుగ్గలి పొలాల్లో వజ్రాలు దొరుకుతాయనే ప్రచారం ఉంది. కర్నూలు జిల్లా నుంచే కాకుండా గుంటూరు, అనంతపురం, బళ్లారి జిల్లాలకు చెందిన వారు ఇక్కడ నెల రోజుల పాటు తిష్ట వేసి వజ్రాల వేట సాగిస్తారు. కొంత మంది సంవత్సరాల పాటు వజ్రాలను వెతికినా దొరక్కపోగా, మరికొందరికి వచ్చిన ఏడాదే దొరికాయన్న ప్రచారం సాగుతోంది.

## బీఎస్ఎన్ఎల్ రంజాన్ ఆఫర్..

**న్యూఢిల్లీ :** రంజాన్‌ను పురస్కరించుకుని ప్రభుత్వ రంగ టెలికం సంస్థ బీఎస్ఎన్ఎల్ 'ఈద్ ముబారక్ ఎస్టీవీ 786' పేరిట ప్రీపెయిడ్ ప్యాక్‌ను ప్రకటించింది. 150 రోజుల కాలపరిమితితో రోజుకు 2జీబీ 3జీ/4జీ డేటా, వంద ఎస్సెమ్మెస్‌లు, అపరిమిత వాయిస్ కాల్స్ వంటి ప్రయోజనాలు లభిస్తాయి. అంటే రూ.786 రీచార్జ్‌తో ఐదు నెలలకు మొత్తం 300 జీబీ డేటా, 15 వేల ఎస్సెమ్మెస్‌లు లభిస్తాయన్నమాట. ఢిల్లీ, ముంబై సర్కిళ్లకు కూడా వాయిస్ కాల్స్ చేసుకునే వెసులుబాటు ఉంది. ఫిఫా వరల్డ్‌కప్ 2018ను పురస్కరించుకుని రోజుకు 4జీబీ డేటా ప్యాక్‌ను ప్రకటించిన మరుసటి రోజే ఈ ఆఫర్ తీసుకురావడం గమనార్హం.

## ఉక్కు హుళక్కే !

- కడప, బయ్యారంలో కర్మాగారాలు లేనట్టే
- తెలుగు రాష్ట్రాల ఆశలపై కేంద్రం నీళ్లు
- సాధ్యం కాదని సుప్రీంలో అఫిడవిట్



**న్యూఢిల్లీ :** ఉక్కు కర్మాగారాలు నెలకొల్పడం పై తెలుగు రాష్ట్రాలకు కేంద్రప్రభుత్వం మొండిచెయ్యి చూపింది.ఏపీ పునర్విభజన చట్టం-2014 ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లో కడప, తెలంగాణలో బయ్యారంలో ఉక్కు కర్మాగారాలు ఏర్పాటు చేస్తామని అప్పటి యుపీఏ ప్రభుత్వం హామీ ఇచ్చింది. తర్వాత అధికారంలోకి వచ్చిన బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం ఇదిగో.. అదిగో..అంటూ నాలుగేళ్లపాటు కాలయాపన చేసి చివరకు తెలుగు రాష్ట్రాల ఆశలపై నీళ్లు చల్లింది. కడప, బయ్యారంలలో ఉక్కు కర్మాగారాల ఏర్పాటు సాధ్యం కాదని సుప్రీంకోర్టులో దాఖలు చేసిన అఫిడవిట్‌లో పేర్కొంది. విభజన హామీల అమలుపై తెలంగాణ కాంగ్రెస్ నాయకుడు పొంగులేటి సుధాకం రెడ్డి సుప్రీంలో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై కేంద్రం అఫిడవిట్‌ను దాఖలు చేసింది. తెలుగు రాష్ట్రాల్లో ఉక్కు కర్మా గారాల ఏర్పాటుకు సంబంధించి సాధ్యా సాధ్యాలపై పరిశీలించాలని మాత్రమే విభజన చట్టంలో పేర్కొన్నారని అఫిడవిట్‌లో తెలిపింది. రాష్ట్ర విభజన జరిగిన మొదటి ఆరు నెలల్లోనే దీనిపై కేంద్రం స్పష్టం చేసినప్పటికీ మరోసారి పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని కేంద్ర ఉక్కుమంత్రిత్వశాఖను రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కోరినట్లు పేర్కొంది.అయితే అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాత కర్మాగా రాల ఏర్పాటు సాధ్యం కాదని మరోసారి స్పష్టమైన నివేదిక వచ్చినట్లు తెలిపింది. ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఈ విషయమై పరిశీలన జరపగా, ఇప్పటికే ఉన్న పరిశ్రమలు నష్టాల్లో ఉన్నాయని, ఇబ్బంది కరమైన పరిస్థితుల్లో ఏర్పాటు సాధ్యం కాదని ఇరు రాష్ట్రాలకు వివరించినట్లు తెలిపింది. ఖనిజాల లభ్యత కూడా కష్టతరమైన నేపథ్యం లో ఇప్పటికిప్పుడు కొత్తగా రెండు రాష్ట్రాల్లో ఉక్కు కర్మాగారాలు ఏర్పాటు వీలు కాదని తాము స్పష్టం చేశామని కేంద్రం పేర్కొంది. అనేక మంత్రిత్వ శాఖలు, కేంద్రంలోని పలువురు మంత్రులు మరోసారి పరిశీలిం చాలని చేసిన విజ్ఞప్తి దృష్ట్యా మెకాన్ సంస్థతో పూర్తిస్థాయిలో అధ్యయనం చేశామని కేంద్రం వెల్లడించింది. ఆ సంస్థ ఇచ్చిన నివేదిక ఆధారంగా కడప, బయ్యారం రెండు చోట్లా ఉక్కు పరిశ్రమల ఏర్పాటు సాధ్యం కాదని, ఇప్పటికప్పుడు చేయడం వల్ల నష్టం వస్తుందని తేల్చి చెప్పింది. ఇప్పటికే వీటిపై కోర్టుల్లో దాఖలైన పిటిషన్లకు తాము సమా ధానాలు చెబుతున్నామని అఫిడవిట్‌లో కేంద్రం పేర్కొంది.

## ఫాతిమా బాధితుల సమస్య పరిష్కారమయ్యేనా..?

**రాజధాని ప్రతినిధి, అమరావతి :** ఫాతిమా వైద్యకళాశాల బాధిత విద్యార్థుల సమస్య మళ్లీ మొదటికి వచ్చింది. నీట్ పరీక్షలో పలువురు బాధితులు అర్హత పొందడంతో ప్రభుత్వంపై మరింత ఒత్తిడి పెరిగింది. ప్రతిభ గల వారికి ఫాతిమాలో మెడికల్ సీట్లు ఇప్పించేందుకు చర్యలు చేపట్టాలని వారంతా డిమాండ్ చేస్తున్నారు. ఇటీవల కడప జిల్లాలో సీఎం చంద్రబాబును బాధితులు కలిసి ఈ సమస్యను వివరించారు. నీట్ హాల్‌టిక్కెట్లు, ర్యాంకు కార్డులతో అమరావతికి వచ్చి తనను కలవాలని సీఎం భరోసా ఇచ్చారని వారు తెలిపారు. ఈ సారైనా ప్రభుత్వం మెడికల్ సీట్ల వ్యవహారాన్ని చక్కదిద్దుతుందా? లేక కాలయాపనం చేస్తుందా? అనే దానిపై వారంతా ఆందోళన చెందుతున్నారు.ఈ నెల 11 సోమవారం ఆంధ్రా, తెలంగాణా రాష్ట్రాలకు చెందినా బాధితులంతా అమరావతికి తరలివస్తారని విద్యార్థి నుజీర్ పేర్కొన్నారు. ఉన్నతాధికారులను, ఎన్టీఆర్ హెల్త్‌వర్సిటీ వీసీ, రిజిస్ట్రార్‌లను వారంతా కలుస్తారు. ప్రభుత్వం ఇచ్చినా మాటను నెరవేర్చకుంటే ....మళ్లీ ఉద్యమాన్ని నిర్వహిస్తామని బాధితులు చెబుతున్నారు.

కౌన్సెలింగ్‌కు ముందే స్పందించాలి... నీట్ కౌన్సిలింగ్‌కు ముందే ప్రభుత్వం స్పందించాలని పలువురు పేర్కొంటున్నారు. లేకుంటే విద్యార్థులు మరో విద్యా సంవత్సరాన్ని కోల్పోయే పరిస్థితి నెలకొంది. ఈ నెలఖరుకుగానీ, జూలై మొదటివారంలో గానీ కౌన్సెలింగ్ నిర్వహించే అవకాశముంది. ఈలోగా తమసీట్ల సమస్యల్ని పరిష్కరించి, అర్హత పొందిన వారందరికీ న్యాయం చేయాలని కోరుతున్నారు. నీట్‌లో అనర్హులకు, పరీక్ష రాయని బాధితులకు ఫాతిమా యాజమాన్యం వసూలు చేసినా సొమ్ము వాపస్ ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. రాష్ట్రానికి వైద్యారోగ్యశాఖ మంత్రి లేకపోవడంతో ఈ సమస్య తలెత్తిందని బాధిత కుటుంబాలు వాపోతున్నాయి.

## అవినీతి పెరిగింది: పురందేశ్వరి



**రాజధాని ప్రతినిధి, అమరావతి :** ఏపీలో అవినీతి బాగా పెరిగిపోయిందని బీజేపీ నేత పురందేశ్వరి ఆరోపించారు. ఈరోజు ఆమె మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్రాభివృద్ధికి కేంద్రం సహకరిస్తున్నా ప్రజల్లో తమను దోషులుగా నిలబెట్టాలని చూస్తున్నారని టీడీపీపై విమర్శలు చేశారు. 13 జాతీయ సంస్థలు, విద్యాసంస్థలు రాష్ట్రానికి రాలేదా? బిల్లులోని ఏ ఒక్క హామీనైనా నెరవేర్చబోమని చెప్పామా? అని ప్రశ్నించారు. రాష్ట్రానికి కేంద్రం నిధులు ఇస్తున్నప్పటికీ సద్వినియోగం చేసుకోవట్లేదని, బీజేపీపై, ప్రధానిపై టీడీపీ నేతలు అనుచిత వ్యాఖ్యలు చేయడం సబబు కాదని ఆమె విమర్శించారు.


# రాజధాని క్లాసిఫైడ్స్

### నివాస ప్లాట్లు

**నవులూరు**
రాజధాని ప్రాంతంలోని నవులూరు గ్రామ పరిధిలో 500, 1000 గజముల ప్లాట్లు కావలెను
ఫోన్ :9440662699

**రాయపూడి**
రాజధాని ప్రాంతంలోని రాయపూడి గ్రామ పరిధిలో 500, 1000 గజముల ప్లాట్లు కావలెను
ఫోన్ : 9908244333

నీరుకొండ
రాజధాని ప్రాంతంలోని నీరుకొండ గ్రామ పరిధిలో 500, 1000, 2000 గజముల ప్లాట్లు కావలెను
ఫోన్: 9440662699

### ఇతరములు

**తుళ్ళూరు**
ఎస్.ఎమ్(స్టైల్ ఫర్ మెన్) ట్రైలర్స్
ఫోన్ 9440307123

వెంకటపాలెం
సాయిలాస్య రియల్‌ఎస్టేట్ & ఫైనాన్స్ కన్సల్టెన్సీ, గాదె నాగేశ్వరరావు
ఫోన్ : 951515393

**మందడం**
ఎస్.ఆర్.కె. గ్రాండ్ రెస్టారెంట్
ఫోన్ : 9553023388

**వెలగపూడి**
సాయి గణేష్ ట్రేడర్స్: నిర్మాణ రంగానికిసిమెంట్, స్టీలు, పైపులు, పెయింట్‌లు అమ్మబడును.
ఫోన్ : 9640811333

**రాయపూడి**
చంద్రిక ట్రేడర్స్ నిర్మాణ రంగానికి సిమెంట్, స్టీలు,పైపులు అమ్మబడును.
ఫోన్ : 9908073516

**రాయపూడి**
రియల్‌ఎస్టేట్ క్రయ,విక్రయాలకు సంప్రదించడం న్యూసింగపూర్ రియల్ ఎస్టేట్
ఫోన్ : 9848442436

**రాయపూడి**
కాకతీయ ఫుడ్ కోర్ట్
ఫోన్ 9848021898

### షాప్స్

**తుళ్ళూరు**
రేమాండ్స్‌ట్రైలర్స్
ఫోన్ : 9492470426

**రాయపూడి**
వర్షిత ఫోటోస్టాట్
ఫోన్ : 9985853188

**తుళ్ళూరు**
వైభవ్ డ్రస్సెస్
ఫోన్ : 9848407935

**తుళ్ళూరు**
రాజా గోల్డ్ కవరింగ్
ఫోన్ : 9581500500

**తుళ్ళూరు**
శ్రీసాయి జ్యూయలరీ వర్క్స్
ఫోన్ :9247171083

**రాయపూడి**
ఖాజా ఖాదర్ రైస్ స్టోర్స్
ఫోన్ : 9603990791

### హస్పటల్స్

**విజయవాడ**
ఆంధ్ర హస్పటల్, డా॥శ్రీమన్నారాయణ
ఫోన్ : 9177219900

**విజయవాడ**
ఇంధిరారావు మెడికేర్ (సెంటర్)
ఫోన్ : 9440421580

**విజయవాడ**
న్యూఫేస్ కీనిక్ , డా॥మేహబూబ్
ఫోన్ : 9849122788

**విజయవాడ**
అష్రఫ్ మెటర్నిటీ & ఇ.ఎన్‌టి డా॥ రెహమాన్
ఫోన్: 0866-2475087

**విజయవాడ**
శ్రీమానస సైకియాట్రిక్ డా॥ అయోధ్య ఆర్.కె
ఫోన్:0866-2436647

విశాఖపట్నం
చింతలూరు ఆయుర్వేద డా॥ విశ్వనాథ్
ఫోన్ :90329 90138

### వాణిజ్య ప్లాట్లు

**నవులూరు**
రాజధాని ప్రాంతంలోని నవులూరు గ్రామ పరిధిలో 500, 1000, 2000 గజముల ప్లాట్లు కావలెను
ఫోన్ : 9440662699

**ఐనవోలు**
రాజధాని ప్రాంతంలోని ఐనవోలు గ్రామ పరిధిలో 500, 1000, 2000 గజముల ప్లాట్లు కావలెను
ఫోన్ : 9908244333

నీరుకొండ
రాజధాని ప్రాంతంలోని నీరుకొండ గ్రామ పరిధిలో 500, 1000, 2000 గజముల ప్లాట్లు కావలెను
ఫోన్ : 9440662699

### విద్యా సంస్థలు

ఐనవోలు
విఐటీ-ఏపీ యూనివర్శిటీ
ఫోన్ :0863 2370444

నీరుకొండ
ఎస్ఆర్ఎమ్ యూనివర్శిటీ
ఫోన్ :0863 2343000

**గమనిక : క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటన దారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.**

**- మేనేజర్**

ప్రకటనలకు సంప్రదించండి 9493170689


## విద్యార్థుల ప్రగతికి అగస్త్య ఫౌండేషన్

బెంగళూరు : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పిల్లల్లో ఆసక్తి పెంచడం,పోషణా నైపుణ్యం, ఆత్మవిశ్వాసం పెంపొందించ డానికి అగస్త్య ఫౌండేషన్ పాటుపడుతుంది. దీన్ని రామ్‌జీ రాఘవన్ స్థాపించారు. లండన్ బిజినెస్ స్కూల్ నుంచి ఎంబీఏ డిగ్రీని సంపాదించిన తర్వాత, 20 ఏళ్లలోనే ఆర్థికంగా ఎంతో ఎత్తుకు ఎదిగారు. తర్వాత తన వ్యాపార జీవితానికి స్వస్తి చెప్పి ఏదైనా సేవ చేయాలని భారత్‌కు తిరిగి వచ్చేశారు. అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్ చైర్మన్‌గా రామ్‌జీ.. వ్యూహం, ఆవిష్కరణ, నిధుల సేకరణ, వ్యూహాత్మక భాగస్వామ్యాలు, సంస్థాగత అభివృద్ధి, ప్రజా సమాచార ,బోర్డు, మీడియా సంబంధాల విషయంలో బాధ్యతలు నిర్వర్తించడంలో కృషి చేశారు.

అగస్త్య ఫౌండేషన్ ట్రస్ట్.. పారదర్శకమైన, ప్రయోగాత్మక విద్యను అందిస్తూ ప్రపంచంలోనే సైన్స్ ఎడ్యుకేషన్ ప్రొగ్రామ్స్ కలిగి ఉన్న పెద్ద సంస్థలలో ఒకటిగా గుర్తింపు పొందింది. "మొబైల్ వ్యాన్ సైన్స్ లాబ్స్", "లాబ్ ఆన్ ఏ బైక్", "లాబ్ ఇన్ ఏ బాక్స్" , "యంగ్ ఇన్‌స్ట్రక్టర్ లీడర్స్" వంటి ఆవిష్కరణలతో విద్యార్థుల్లో నైపుణ్యాన్ని పెంపొందించడానికి కృషి చేస్తుంది. అగస్త్యా ఫౌండేషన్ 72 ఎకరాల విస్తీర్ణంలో క్యాంపస్ క్రియేటివిటీ ల్యాబ్ కలిగి ఉంది. ఇందులో సైన్స్ సెంటర్స్, డిస్కవరీ సెంటర్స్, ప్రపంచంలోనే అతిపెద్ద ప్లానెటరీ సిస్టమ్ కలిగి ఉన్న ఆస్ట్రానమీ సెంటర్, రోబోటిక్స్ సెంటర్, ఆర్ట్ ల్యాబ్, మీడియా ఆర్ట్స్ ల్యాబ్, ఓపెర్ ఎయిర్ ఎకాలజీ ల్యాబ్ ఉన్నాయి. భారతదేశంలోని 18 రాష్ట్రాల్లో 60 సైన్స్ కేంద్రాలు, 150 మొబైల్ సైన్స్ ల్యాబ్స్, 60 ల్యాబ్ ఆన్ బైక్స్, 400 నైట్ విలేజ్ స్కూల్స్ ద్వారా 2000 మంది టీచర్లు, 1.5 మిలియన్ విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు. భారత్‌తో పాటు ప్రపంచ వ్యాప్తంగా వివిధ విద్యాసంస్థలు, భాగస్వామ్య సంస్థలు, ప్రభుత్వాలతో అనుబంధంగా అగస్త్య ఫౌండేషన్ పని చేస్తుంది.

ఆర్థికంగా వెనుకబడి విద్యార్థుల్లో శాస్త్ర, సాంకేతిక రంగాల్లో జిజ్ఞాస, సృజనాత్మకత, ఆత్మవిశ్వాసం, ప్రతిభను వెలికి తీసేందుకు అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్ కృషి చేస్తోంది. భారతదేశంలోని 19 రాష్ట్రాల్లో ఇప్పటికే ఆ సంస్థ తన కార్యకలాపాలను విస్తరించిన సంగతి తెలిసిందే. 19 ఏళ్లుగా ఆ సంస్థ చేస్తున్న సేవల వల్ల 10 మిలియన్ల మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరగా, 2,50,000 మంది ఉపాధ్యాయులకు మార్గదర్శకంగా నిలుస్తోంది. భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఆ సంస్థ ఈనెల 8న కాలిఫోర్నియాలోని మిల్ పిటాస్ లో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసింది.

ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు, ఉపాధ్యాయులకు శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింతగా పెంచేందుకు, వారికి తోడ్పాటును ఇచ్చేందుకు కార్యాచరణ రూపొందించనుంది ఆగస్త్య. ఆగస్త్య ఉద్యమం పేరుతో రూపొందించే ఈ కార్యక్రమంలో తీసుకునే నిర్ణయాలు భారత్‌లోని ఆర్థికంగా వెనుకబడిన పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులకు ప్రయోజనకరంగా మారనుంది. అభివృద్ధికి పాటుపాడే వారంతా వచ్చి తమకు తగిన సహకారం అందించాలని వారు కోరుతున్నారు.

# ఆనందం నింపే రామజాన్

**ప్రపంచంలో ప్రతి పండుగ సుహృద్భావాన్ని పెంచేదే.. అయితే రంజాన్ అన్ని పండుగల కంటే భిన్నమైనది. దునియాలో అందరూ సంతోషంగా ఉండాలని పేదసాదలు కూడా ఆనందం పొందాలని మహ్మద్ ప్రవక్త భావించారు. అందుకు తగ్గట్టుగా గౌరవనీయులు, ఉన్నత వర్గాలు పేదలపట్ల కనికరంగా ఉండాలని, జకాత్ (దానధర్మాలు ) చేయాలని నిర్ధేశించారు.**



### జకాత్ ( దానధర్మాలు)

రంజాన్ నెలలో స్తోమతకు తగ్గట్లుగా దానధర్మాలు చేయడం ముస్లింలు నియమంగా పాటిస్తారు. సంపాదనాపరులైనవారు, సంపన్నులైనవారు రంజాన్ నెలలో ‘ జకాత్ ‘ అచరించాలని ఖురాన్ బోధిస్తోంది. ఆస్తిలో నుంచి నిర్ణీత మొత్తాన్ని పేదలకు దానం చేయడాన్ని ‘ జకాత్’ అని అంటారు. దీనిని పేదల ఆర్థిక హక్కుగా పేర్కొంటారు. దీని ప్రకారం ప్రతి ధనికుడు సంవత్సరాంతంలో మిగిలిన తన సంపద నుండి రెండున్నర శాతం 2..5 చొప్పున ధన, వస్తు, కనకాలను ఏవైనా నిరుపేదలకు దానంగా యిస్తారు. పేదవారు కూడా అందరితో పాటు పండుగను జరుపుకొనడానికి, సంతోషంలో పాలుపంచుకునేందుకు ఈ ‘జకాత్ ఉపయోగపడుతుంది.

### ఫిత్రా

‘జకాత్’ తో పాటు ‘ ఫిత్రా’ దానానికి రంజాన్ నెలలో ఎంతో ప్రాముఖ్యత ఉంది. మూడుపూటల తిండికి, ఒంటినిండా బట్టకు నోచుకోని పేదవారు ఎంతోమంది ఉన్నారు. ఇలాంటి అభాగ్యులకు, పేదవారికి పండుగ సందర్భంగా దానం చేయాలని ఇస్లాం మతం ఉద్బోధిస్తోంది. దీనినే ‘ ఫిత్రాదానం’ అని పిలుస్తారు. ఉపవాసవ్రతాలు విజయవంతంగా ముగిసినందులకు దేవుడి పట్ల కృతజ్ఞతగా .. పేదలకు ఈ ఫిత్రాదానం విధిగా అందజేస్తారు. ఈ ఫిత్రాదానంలో 50 గ్రాముల తక్కువ రెండు కిలోల గోధుమలను గానీ, దానికి సమానమైన ఇతర ఆహారధాన్యాలను గానీ, దానికి సమానమైన ధనాన్ని గానీ పంచిపెట్టాలి. ఈ దానం కుటుంబంలోని సభ్యులందరి తరపున పేదలకు అందజేయాలి. దీనివలన సర్వపాపాలు హరించబడి, పుణ్యం దక్కుతుందనే నమ్మకం ఉంది.

దైవ ప్రవక్త ఫిత్రాదానాన్ని విధిగా నిర్ణయించడానికి కారణం - ఉపవాస వ్రత నియమాన్ని పాటించే సమయంలో హ ృదయంలో కలిగే చెడు తలంపులు, ఆలోచనలు, నోటినుంచి వెలువడే అసత్యాలు, పనికిమాలిన మాటలు వంటి పొరపాట్లు జరుగుతూ వుంటాయి. ఇలాంటి అనాలోచిత పొరపాట్లు అన్నీ ఫిత్రాదానం వల్ల క్షమించబడతాయి ‘ అని మహమ్మద్ అనుచరుడు అబ్దుల్లా బిన్ మసూద్ తెలిపాడు.

### షబె ఖద్ర్ (ఘనమైన రాత్రి) ఘనతలు

### 28.1 షబెఖద్ర్ లేక లైలతుల్ ఖద్ర్

సంవత్సరము మొత్తంలో శుభప్రదమయినది రమజాన్‌నెల. రమజాన్ నెలలో అత్యంత విలువైనది పుణ్యప్రదమయిన రాత్రి షబె ఖద్ర్. ఆ రాత్రిలో పశ్చాత్తాప భావముతో అల్లాహ్‌ను ఆరాధించిన వ్యక్తి అపరాధములన్నీ క్షమించబడతాయి. ఎవ్వరైతే (నిష్కల్మషమైన) విశ్వాసముతో పుణ్యఫలాపేక్షతో షబె ఖద్ర్ (ఘనమైన రాత్రి) నందు అల్లాహ్ ఆరాధనలో గడిపాడో అతని వల్ల జరిగిన పాపాలు, జరుగబోయే పాపాలు క్షమించబడతాయి (బుఖారి, అబూదావూద్)పవిత్ర ఖుర్‌ఆన్ , హదీసుల మూలముగా షబె ఖద్ర్ యొక్క ఘనత స్పష్టమవుచున్నది. ఇది వేయి నెలల కన్నా శ్రేష్ఠమైనది. అనగా వెయ్యి నెలలు ఆరాధించిన కలుగు పుణ్యఫలము కన్నా అత్యధిక పుణ్య ఫలము షబె ఖద్ర్‌లో ఆరాధించుట వలన కలుగును. (బయానుల్‌ఖుర్‌ఆన్)



“షబె ఖద్ర్‌లో అల్లాహ్ దూత జిబ్రాఈల్ అలైహిస్సలామ్ అల్లాహ్ దూతల సమూహముతో భూమిపై దిగును. నిల్చొని లేదా కూర్చొని అల్లాహ్ నామస్మరణలో నిమగ్నులైయున్న ప్రతి అల్లాహ్ దాసుని కొరకు కారుణ్యం, మన్నింపుల దువా చేస్తారు. దాసులు దువా చేస్తున్నప్పుడు ఆమీన్ పలుకుతారని” మన ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ నల్లల్లాహు అలైహి వ సల్లమ్ తెలిపారు. (బైహఖీ న బయానుల్‌ఖుర్‌ఆన్)

అల్లాహ్ దూతలు షబె ఖద్ర్ యొక్క రాత్రిలో ప్రతి ముస్లిం ఇంటిలో ప్రవేశించి దువా చేస్తారు. దీంతొ ఆ ఇంటి ముస్లింల సమస్త పాపములు క్షమించబడతాయి. కాని నాలుగు గృహాలలో అల్లాహ్ దూతలు ప్రవేశించరు. అవి : 1. కుక్క ఉన్న ఇల్లు, 2. పంది ఉన్న ఇల్లు. 3. సారాయి లేక త్రాగినవారు ఉన్న ఇల్లు. 4. వ్యభిచారులు ఉన్న ఇల్లు. వీరు కాక మిగిలిన అందరి కొరకు ఉదయము వరకు దువా చేయుదురు. ఉదయమవుతున్నప్పుడు అల్లాహ్ దూతలు జిబ్రాఈల్ అలైహిస్సలామ్‌తో “ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వ సల్లమ్ గారి అనుచర సమూహము విషయముగా అల్లాహు తఆలా ఏమి నిర్ణయించిరని” ప్రశ్నింతురు. దానికి సమాధానముగా జిబ్రాఈల్ “నలుగురు దురదృష్టవంతులు తప్ప ముస్లిములందరి పాపములు క్షమించబడినవి. ఆ నలుగురు ఎవరనగా 1. సారాయి త్రాగువాడు. 2. తల్లిదండ్రులకు అవిధేయుడు. 3. బంధువులతో చెడుగా ప్రవర్తించువాడు. 4. కపటము, ద్వేషము ఉంచువాడు” అని తెలిపారు.

### పండుగ నమాజ్‌లు

ఈదుల్ ఫిత్ర్, ఈదుల్ అజ్‌హా - ఈ రెండు పర్వదినాలలో అల్లాహు తఆలాకు కృతజ్ఞతలు అర్పించుకోవడానికి రెండు రకాతుల నమాజ్ ఆచరించుట పురుషులపై వాజిబ్ (అనివార్యం)గా నిర్ణయించబడింది. ఈ రెండు నమాజ్‌లోఅల అజాన్ గానీ, ఇఖామత్ గానీ ఇవ్వబడవు. ఏ వ్యక్తిపై జుమ్మా నమాజ్ (శుక్రవారపు నమాజ్) వాజిబ్ అవుతుందో, ఆ వ్యక్తిపై ఈద్ నమాజ్ కూడా వాజిబ్ అవుతుంది. ఏ ప్రదేశములో జుమ్మా నమాజ్ ఆచరించుట తగునో, అటువంటి ప్రదేశాలలో ఈద్ నమాజ్ కూడ ఆచరించుటకు తగినదిగా భవించబడుతుంది. ఈ రెండు పండుగల నమాజ్ సమయం సూర్యుడు ఉదయించిన 20 నిమిషాల తరువాత జవాల్ (మిట్టమధ్యాహ్నమున)కు పూర్వము వరకు ఉంటుంది. (దీనియాత్ 1 యం. స. 101)

ఈదుల్ ఫిత్ర్ (రమజాన్ పండుగ) రోజున ఖర్జూరపు పండు లేదా యేదైనా తీపి పదార్థము తిని నమాజ్‌కు వెళ్ళుట సున్నత్ (ప్రవక్త సాంప్రదాయము). ఆ రోజున నమాజ్ కోసం ఈద్గాహ్ లేక మసీదుకు వెళ్ళునప్పుడు “తక్బీర్” మెల్లగా బిగ్గరగా పలుకుట సాంప్రదాయము.

ఈదుల్ ఫిత్ర్ (రమజాన్) నమాజ్ ఆలస్యంగా చదువుట, ఈదుల్ అజ్‌హా (బక్రీదు పండుగ) నమాజ్ త్వరగా చదువుట మస్‌నూన్ (సాంప్రదాయము), స్థోమతగలవారు ఈదుల్ ఫిత్ర్ (రమజాన్ పండుగ) రోజున “సదఖాయ్ ఫిత్ర్” (ఫిత్రా దానం) చేయుట, ఈద్ (పండుగ) నమాజ్ చదివే ప్రదేశాలలో ఈద్ నమాజ్‌కు పూర్వము గానీ తరువాత గానీ వేరే నమాజ్‌లు ఆచరించుట మక్రూ (అప్రీతికరము) ఈద్ (పండుగ) నమాజ్ తరువాత ఇంటికి వచ్చి నమాజ్ ఆచరించిన మక్రూ కాదు. కానీ ఈద్ (పండుగ) నమాజ్‌కు పూర్వం ఇంటిలో నమాజ్ ఆచరించుట కూడా మక్రూ అగును. స్త్రీలు, మరియు ఏదైనా కారణాల వల్ల ఈద్ నమాజ్ ఆచరించనివారు కూడా ఈద్ (పండుగ) నమాజ్‌కు పూర్వం ఏవైనా నఫిల్ నమాజ్‌లు ఆచరించుట కూడా మక్రూ అవుతుంది.

### ఈద్ ముబారక్ (పండుగ శుభాకాంక్షలు)

నెల పొడుపుతో రంజాన్ ఉపవాస దీక్షలు విరమించి మరుసటి దినాన్ని రంజాన్ పండుగగా నిర్ణయిస్తారు. అల్లా రక్షణ, కరుణ అందరూ పొందాలన్న ఆశయంతో ఈద్గాలో బారులుతీరి పండుగ నమాజు చేస్తారు. కొత్త వస్త్రాలు, పరిమళ ద్రవ్యాలతో వాతావరణమంతా ఆహ్లాదకరమవుతుంది. ధనిక, బీద తారతమ్యం లేక, సహృదయాలతో ప్రేమానురాగాలతో ఆలింగనం చేసుకుంటారు. ద్వేషాలన్నీ సమసి ప్రేమపూరిత భావం ఇనుమడిస్తుంది. ప్రత్యేకంగా సేమ్యాతో చేసిన ఖీర్ తినిపించుకొని ముస్లింలే కాక ముస్లిమేతర సోదరులు కూడా కలిసి శుభాకాంక్షలు తెలియజేసుకుంటారు. మానవుల మధ్య నెలకొన్న వర్గ వైషమ్యాలు తొలగించి అందరిలో ఆధ్యాత్మిక చింతన కలిగించి చిరుజీవితాన్ని ఆనందంతో నింపి పుణ్యకార్యాల వైపు ద ృష్టి మరల్చే రంజాన్ మాసం చైతన్యాన్ని కలిగించి ముందుకు సాగే ధైర్యాన్నిస్తుంది. ఈ పండుగను పేద, ధనిక తేడా లేకుండా అత్యంత భక్తి ప్రవత్తులతో జరుపుకుంటారు. ప్రతే ఒక్కరూ కొత్త బట్టలు ధరించి పండుగ నమాజును ఊరిబయట నిర్ణీత ప్రదేశాలైన ఈద్‌గాహ్ లలో చేస్తారు. అనంతరం ఒకరికొకరు ‘ ఈద్‌ముబారక్ ‘(శుభాకాంక్షలు) తెలుపుకుంటారు. ఈ నమజ్ కోసము వెల్లదనికి ఒక దారి వదలి మరొక దారిలో రావలెను.

**అల్లాహ్ ఆరాధన, ధానధర్మాలు, విధేయత మొదలయిన పుష్పాలు వికసిస్తూ ఉంటాయి. మన సృష్టికర్త మన పట్ల సంతుష్టి చెందాలి. ఆ విధంగా కృషి చేసే సద్బుద్దిని అల్లాహ్ మనకు ప్రసాదించుగాక! ఆమీన్!**

**అందరికీ రంజాన్ శుభాకాంక్షలు... - ఖాన్**

## టీడీపీకి గుడ్ బై చెప్పనున్న ఆనం?



**రాజధాని ప్రతినిధి, అమరావతి :** టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి టీడీపీకి గుడ్ బై చెప్పనున్నారు. వైసీపీలోకి ఆయన చేరేందుకు రంగం సిద్ధమైనట్టు విశ్వసనీయ సమాచారం. జూలై 8న దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి సందర్భంగా ఆయన వైసీపీ తీర్థం పుచ్చుకోనున్నారు. టీడీపీలో రామనారాయణను కొనసాగించేందుకు టీడీపీ నేతలు జరిపిన బుజ్జగింపులు ఫలించలేదు. రెండు, మూడు రోజులుగా అభిమానులు, సన్నిహితులతో ఆయన సమావేశాలు నిర్వహించారు. పార్టీ మారాలనుకోవడానికి కారణాలు వివరిస్తూ, వారి మద్దతును కూడగట్టుకునే ప్రయత్నం చేశారు.

వాస్తవానికి పార్టీ మారాలనే నిర్ణయాన్ని కొన్ని నెలల ముందే రామనారాయణ రెడ్డి తీసుకున్నారు. టీడీపీలో చేరే సమయంలో చంద్రబాబు తమకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదనే అసంతృప్తి ఆయనలో ఉంది. మినీ మహానాడు వేదికలపై కూడా టీడీపీని, పార్టీ విధానాలను ఆయన బహిరంగంగా విమర్శించారు. ఈ నెల 2న నెల్లూరులో జరిగిన నయవంచన దీక్ష వేదికపైనే ఆయన వైసీపీకి సంఘీభావం ప్రకటించాల్సి ఉంది. అయితే తిథులు బాగాలేవని ఆ కార్యక్రమాన్ని ఆయన వాయిదా వేసుకున్నారని సమాచారం.

## ఆగస్టు 15న ‘గోల్డ్’




1948లో ఇంగ్లాండ్‌లో జరిగిన ఒలింపిక్స్‌లో ఇండియన్ హాకీ టీమ్ ఫస్ట్ గోల్డ్ మెడల్ కొట్టింది. పతకం నెగ్గిన సంతోషంతో దేశ పతాకం రెపరెపలాడింది. ఈ మధురమైన సంఘటనల ఆధారంగా హిందీలో రూపొందిన సినిమా ‘గోల్డ్’.

ఇండియన్ హాకీ టీమ్ ప్లేయర్ బల్బీర్‌సింగ్ పాత్రలో బాలీవుడ్ నటుడు అక్షయ్ కుమార్ నటించారు. రీమా ఖగ్తీ దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమాలో మౌనీ రాయ్, కునాల్ కపూర్, అమిత్, వినీత్ కీలక పాత్రలు చేశారు. గతేడాది డిసెంబర్‌లో షూటింగ్ కంప్లీట్ చేసుకున్న ఈ సినిమాను ఆగస్టు 15న రిలీజ్ చేయనున్నట్లు అధికారికంగా చిత్రబ ృందం తెలిపింది. అంటే.. పంద్రాగస్టుకి ‘గోల్డ్’ అన్నమాట. గతేడాది ఇండిపెండెన్స్ వీక్‌లో ‘టాయ్‌లెట్: ఏక్ ప్రేమ్‌కథ’ చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన అక్షయ్ ఈసారి ‘గోల్డ్’ సినిమాతో థియేటర్స్‌లోకి రానుండటం విశేషం.

## షార్ట్ ఫిల్మ్ పోటీలు




ప్రతిభ కలిగిన లఘు చిత్ర దర్శకులు, నటీనటులు, సాంకేతిక నిపుణులను ప్రోత్సహించాలనే సదుద్దేశంతో ఉత్తర అమెరికా తెలుగు సంఘం(నాటా) షార్ట్ ఫిల్మ్ కాంటెస్ట్ నిర్వహించబోతోంది. అమెరికాలోని ఫిలడెల్ఫియాలో జూలై 6 నుంచి 8 వరకు రెండు రోజుల పాటు జరిగే నాటా ఉత్సవాల్లో భాగంగా ఈ పోటీలు నిర్వహించనున్నట్లు ఆ సంస్థ ప్రతినిధులు శివ మేక, మహేందర్, ఉదయ్ తెలిపారు.

ప్రముఖ దర్శకులు వంశీ, హరీశ్ శంకర్, మధుర శ్రీధర్, మహి వి రాఘవ్, డాక్టర్ ఆనంద్ ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించనున్నారు. అంతర్జాతీయ వేదికపై, అతిరథమహారథుల సమక్షంలో జరగబోయే ఈ కార్యక్రమంలో ప్రపంచం నలుమూలల నుంచి ఎంతో మంది సినీ, రాజకీయ ప్రముఖులు పాల్గొంటారని డైరెక్టర్ డాక్టర్ ఆనంద్ ఓ ప్రకటనలో తెలిపారు. యువ ఫిల్మ్ మేకర్స్ అందరూ ఈ కాంటెస్ట్‌లో పాల్గొని తమ ప్రతిభను చాటాలని ఆనంద్ కోరారు. విజేతలకు లక్ష రూపాయల వరకు బహుమతులు ఉంటాయని, అలాగే స్పెషల్ జ్యూరీ అవార్డులు, ప్రశంసా పత్రాలను అందజేయడం జరుగుతుందని తెలిపారు. షార్ట్ ఫిల్మ్ మేకర్స్ అందరూ తమ చిత్రలను నాటా వారి వెబ్‌సైట్‌లో కానీ, http://www.nata 2018.org/event/event_view /2 లింక్ ద్వారా గానీ రిజిస్టర్ చేసుకోవచ్చని ఆయన తెలిపారు. జూన్ 30వ తేదీ లోపు రిజిస్టర్ చేసుకోవాలని డైరెక్టర్ ఆనంద్ సూచించారు.

### మహిళ, శిశు సంక్షేమ శాఖ

## ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి : అశోక్‌బాబు



**రాజధాని ప్రతినిధి,అమరావతి:** మహిళ, శిశు సంక్షేమ శాఖలోని అంగన్ వాడీ కార్యకర్తల, హెల్పర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఏపీ ఎన్జీవో అధ్యక్షుడు అశోక్‌బాబు హామీ ఇచ్చారు. అంగన్‌వాడీల జీతాలివ్వడంలో జాప్యం, జీతాల పెంపుదల తో పాటుగా ఉద్యోగ విరమణ తర్వాత చెల్లించే 50,000, 20,000 చాలట్లేదని, ఉద్యోగ విరమణ తర్వాత బీమా సౌకర్యంకల్పించాలని వారు కోరారు. అంగన్‌వాడీలలో నాణ్యత లేని పోషకాహారం సరఫరా చేస్తున్నారని వారు వాపోయారు. సెంటర్లలో డ్యూటీ గార్డు నియామకం జరపాలని, కాంట్రాక్టు సూపర్‌వైజర్లు రెగ్యుల రైజేషన్,బయోమెట్రిక్ నుండి ఫీల్డు సిబ్బంది మినహాయింపు సమస్యలను పరిష్కారించాలని కోరారు. అదనపు పనులను రద్దు చేయాలని సుప్రీంకోర్టు ఆదేశాలున్నప్పటికీ వాటిని అమలు చేయటం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. సమాన పనికి సమాన వేతనం కల్పించే దిశగా ప్రభుత్వానికి వినతి చేయాలని సూపర్‌వైజర్లు సంఘం కోరింది. డేటా ఎంట్రీ డూప్లికేషన్ జరగడం వలన, పని ఒత్తిడి భారం పెరగుతోందని ఉద్యోగులు తెలిపారు. మహిళ, శిశు సంక్షేమ శాఖ అధికారులు,సూపర్‌వైజర్లు, నాన్-గెజిటెడ్ ఉద్యోగులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్ల జాయింట్ యాక్షన్ కమిటీ (జె.ఏ.సి) అవిర్భావ సభకు 13 జిల్లాల నుండి హాజరైన సుమారు 300 మంది సిబ్బందిని ఉద్దేశించి ఏపీ ఎన్‌జీవో అధ్యక్షుడు అశోక్‌బాబు మాట్లాడుతూ వారిసమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామన్నారు. ఈ సమస్యలలో కొన్ని సిబ్బంది అంతర్గత సమన్వయంతో పరిష్కారం కాగలవని, మరింత మెరుగైన దిశగా పయనించేందుకు నేడు ఏర్పాటైన జె.ఏ.సి. కృషి చేయగలదని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

మహిళా శిశు సంక్షేమ శాఖ ఉద్యోగుల జె.ఏ.సి. చైర్మన్ రాష్ట్ర ఉద్యోగుల అధ్యక్షుడు ఎ. సుబ్బరాజు, కో చైర్మన్లుగా ఎం. నీహారిక, జె.సత్యనారాయణ, వై.జయలక్ష్మి, కె. మంజులవాణి, సెక్రటరీ జనరల్ గా వి. లీలావతి, కోశాధికారిగా సి. హెచ్.శ్రీనివాసు, సెక్రటరీగా పి.పద్మావతి, కో సెక్రటరీ జనరల్ గా కె.లక్ష్మీనారాయణ, పి.భారతి, టి. లలితమ్మ ఇతర కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు.

అశోక్‌బాబు వారిని అభినందిస్తూ, సమస్యలను ఆయా శాఖాధికారుల దృష్టికి తీసుకు వెళ్ళేందుకు సిద్ధంగా ఉండాలని, తన వంతు సహాయ సహకారాలు ఉంటాయని అశోక్‌బాబు హామీ ఇచ్చారు.

## ఎడముఖం- పెడముఖం

### అయ్యన్న, గంటా



**విశాఖపట్నం :** విశాఖ జిల్లాలో మంత్రులు చింతకాయల అయ్యన్నపాత్రుడు, గంటా శ్రీనివాసరావు ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు చెబుతూ గుండెలకు హత్తుకున్నారు. వీరు మాత్రం కనీసం మర్యాద కోసమైనా ఒకరితో మరొకరు మాట్లాడుకోలేదు. ఇకపోతే ముఖ్యమంత్రి చంద్రబాబు తెలుగుదేశం నాయకులతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సీఎం ప్రసంగం వినేందుకు వచ్చిన మంత్రి అయ్యన్నపాత్రుడు హాలులో కూర్చోగా, జిల్లాకు అన్ని రకాలుగా నేతృ త్వం వహించాల్సిన మంత్రుల సఖ్యత లేక పోవడం అటు పార్టీ, ఇటు జిల్లా అభివ ృద్ధిపై ప్రభావం చూపుతోంది. ఇరువురి మధ్య ఎన్నో సంవత్సరాలుగా విభేదాలు ఉన్నాయి. 2014లో గంటా శ్రీనివాసరావు తెలుగుదేశంలోకి రావడాన్ని అయ్యన్న బాహాటంగా వ్యతిరేకించారు. అయితే గంటా భీమిలిలో గెలిచి విజయం సాధించి మంత్రి అయ్యారు. ఆ వైరం ఇంకా కొనసాగుతూనే ఉన్నది. అధికారంలోకి వచ్చిన కొత్తలో ఇరువురు పరస్పర ఆరోపణలు చేసుకునేవారు. ముఖ్యమంత్రి పలుమార్లు పిలిచి మాట్లాడడంతో కొంతకాలంగా బహిరంగ విమర్శలు చేసుకోవడం లేదు కానీ సందర్భం వస్తే తప్పులు ఎత్తిచూపడానికి వెనకాడడం లేదు.

జిల్లా ఎమ్మెల్యేలు కూడా రెండు వర్గాలుగా ఉండేవారు. ఆ మంత్రి పక్కన కొందరు, ఈ మంత్రి వైపు కొందరు తిరిగేవారు. ఇది విభేదాలకు తావిస్తుండడంతో ఎమ్మెల్యేలంతా ఒక వర్గంగా మారిపోయారు. ఎవరితో పని ఉంటే వారి దగ్గరకు వెళ్లి చేయించుకుంటున్నారు. మంత్రుల మధ్య సఖ్యత కోసం తొలుత జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా వున్న తొలుత యనమల రామకృష్ణుడు ప్రయత్నించారు. ఆయన తరువాత హోంమంత్రి చినరాజప్పకు జిల్లా బాధ్యతలు అప్పగించారు. ఆయన కూడా ఇద్దరినీ కలపలేకపోతున్నారు. తూతూమంత్రంగా ప్రతి నెలా జిల్లా సమన్వయ సమావేశం నిర్వహించి చినరాజప్ప పార్టీ ప్రధాన కార్యాలయానికి నివేదికలు పంపుతున్నారు తప్ప క్షేత్రస్థాయిలో సమన్వయం కుదర్చడం లేదు. మంత్రుల మధ్య పంతాలకు జిల్లా అధికారులు బలైపోతున్నారు.




Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/s Vastitude Media Pvt. Ltd., and Printed at M/s Jagati Publications Ltd., Sakshi Press, Survey No. 766/2, Ankireddy Palem Village, Guntur Rural, 522005, Guntur Distt. A.P. and Published at 6-45/1, Rayapudi, Thullur Mandal, Guntur Distt, Andhra Pradesh-522237. Editor: Pattan Hussain Khan, RNI NO: APTEL/2015/66622, Postal Regd No: GTR/84/2016-18, Cell 9440662699, Email : rajadhanivartalu1@gmail.com